ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 12 జూలై 2025


అలంకారప్రాయంగా ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో పనిచేసేందుకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు చైర్మన్, కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో సమగ్ర శిక్ష కార్యాలయంలో సమగ్ర బాలిక శిశు అభివృద్ధి అధికారి (జీసీడీవో), సమగ్ర బాలికా శిశు అభివృద్ధి అసిస్టెంట్ అధికారి (ఏజీసీడీవో)లకు స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్లు, సెకండరీ గ్రేడ్ టీచర్‌గా 8 ఏళ్లు సర్వీస్ కలిగి పీజీ అర్హత కలిగిన మహిళా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏఏంవో, ఉర్దూ పోస్టుకు కూడా అదే అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే సహాయ ప్రోగ్రాం ఆఫీసర్ (ఏపీవో) పోస్టుకు కంప్యూటర్ సైన్స్‌తో పాటు డిప్లమా, డిగ్రీ అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలియజేశారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్స్‌ను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 18వ తేది లోగా సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపించాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

రాయచోటిటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లెలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక పనులను శుక్రవారం డ్వామా పీడీ వెంకటరత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా వరిగ గ్రామంలో జరుగుతున్న కుంటలో పూడికతీత పనులు, మామిడి మొక్కల పెంపకం పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉపాధి పనులను చేస్తున్న కూలీలకు అందుతున్న వసతులు, సదుపాయాలపైన ఆరాతీశారు. అదేవిధంగా ఉపాధి పనులు చేస్తున్న ప్రతి కూలికి రోజుకు కనీసం రూ.307 తగ్గకుండా కూలి వచ్చే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కింద చేపడుతున్న పనుల్లో ఎక్కడైనా నిర్లక్ష్యం కానీ, అవకతవకలు గానీ జరిగితే సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

విషాహారం తిని 14 మేకలు మృతి

● సుమారు రూ.లక్ష నష్టం !


మృతిచెందిన మేకలు

పెద్దతిప్పసముద్రం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓ పొలంలో మందు కొట్టిన గడ్డిని మేకలు తినడంతో 14 మేకలు మృత్యువాత పడ్డ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల వివరాల మేరకు.. బూచిపల్లె గ్రామానికి చెందిన కంచార్లపల్లె సుబ్రమణ్యం అనే ఓ నిరుపేద తన కుటుంబ పోషణ కోసం 15 మేకలను పెంచుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం యథావిధిగా బూచిపల్లె సమీపంలోని చెరువు వద్ద గల సమీప పొలాల్లో మేకలను వదిలాడు. ఆ పక్కనే ఉన్న పొలంలో ఓ రైతు తన పొలంలో గడ్డి ఎక్కువగా ఉండడంతో గడ్డి మందును పిచికారీ చేశాడు. అది తెలియని మేకల కాపరి అటు వైపు తోలాడు. అనంతరం వాటిని ఇంటికి తీసుకెళ్తుండగా ఒక్కొక్కటిగా దారి మధ్యలోనే కుప్పకూలి మృతి చెందాయన్నారు. తనకున్న 15 మేకల్లో ఒక్కటి మాత్రమే మిగిలిందని కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం స్పందించి నిరుపేదకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నమయ్య ప్రాజెక్టుపై..

● నేడు కడపలో కేంద్ర జలవనరులశాఖ ఆధ్వర్యంలో సమావేశం
● రేపు అన్నమయ్య ప్రాజెక్టు పరిశీలన

చిగురిస్తున్న ఆశలు


కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు ఆనకట్ట

రాజంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గంలో అన్నదాతకు ఆయువుపట్టుగా ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు జగన్ ప్రభుత్వంలో నామరూపాల్లేకుండా పోయింది. ప్రాజెక్టు తెగిపోవడానికి కారకులైన వైసీపీ పాలకులు ఎన్నికలకు ముందు రూ.800 కోట్లతో తిరిగి నిర్మిస్తామని, ఆగమేఘాల మీద పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారే కానీ కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయి దాదాపు నాలుగేళ్లు అవుతోంది. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణంపై స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ప్రాజెక్టు డిజైన్ ఎక్స్‌పర్ట్ అయిన పోలవరం ప్రాజెక్టు ప్రధాన చీఫ్ ఇంజనీరు రమేశ్‌కుమార్, హైదరాబాదుకు చెందిన హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ విశ్రాంత సీఈ కె.సత్యనారాయణ, జియాలజిస్టు జీఎస్‌ఐ విశ్రాంత డైరెక్టర్ జనరల్ ఎం.రాజు, విజయవాడకు చెందిన డిజైన్ అప్రూవింగ్ అథారటీ చీఫ్ ఇంజనీర్లు, అన్నమయ్య ప్రాజెక్టు సీఈ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు పునర్నిర్మాణంపై ఒక కమిటీని వేశాయి. ఈ కమిటీ పరిశీలించి నిర్ధారించిన ప్రకారం ప్రాజెక్టు విషయంలో ముందుకు సాగనున్నారు. ఇందులో భాగంగా శనివారం కడపలోని అన్నమయ్య ప్రాజెక్టు సీఈ కార్యాలయంలో ఈ కమిటీ సమావేశం కానుంది. అనంతరం ఆదివారం అన్నమయ్య ప్రాజెక్టును స్వయంగా పరిశీలించి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి రానుంది. ప్రాజెక్టు పూర్వాపరాలను తెలుసుకుని పునర్నిర్మాణంపై ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ఈ కమిటీ పూర్తిస్థాయిలో పరిశీలించనుంది.

పునర్నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు

1960లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు తెగిపోయినప్పుడు ఎక్కువ వరదనీటితో ప్రాణనష్టం ఆస్తినష్టం జరిగిన పులపత్తూరు, తొగూరుపేట ప్రాంతంలో ఈ ప్రాజెక్టుకు తొలుత శంకుస్థాపన చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం కష్టతరమని నిర్ణయించి ఆ తర్వాత ప్రస్తుతం కట్టిన ప్రాంతంలో దీనికి రూపకల్పన చేశారు. సుమారు రూ.60 కోట్ల ఖర్చుతో చంద్రబాబు నాయుడు రెండోసారి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రారంభించారు. ప్రాజెక్టు ఆనుకుని కొండల్లో లీకేజీలు ఉండడం, తెగిపోయిన మట్టికట్ట ప్రాంతంలో 110 అడుగుల వరకు నేల గట్టిదనం లేకపోవడంతో వరద ఉధృతికి ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ప్రాజెక్టు కట్టిన సమయంలో సుమారు మూడేళ్ల పాటు అబ్జర్వేషన్ పీరియడ్ పేరిట పూర్తిస్థాయి నీటిని నింపలేదు. మరో మూడుసార్లు గేట్లు కొట్టుకుపోవడం వల్ల పూర్తిస్థాయి నీరు ఉంచలేదు. కేవలం 2.24 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు 2021 సంవత్సరం నవంబరు 19న ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన 3లక్షల క్యూసెక్కుల వరదనీటితో నామరూపాలు లేకుండా పోయింది. 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతినగా మరో 50 గ్రామాలు తీవ్ర నష్టాలపాలయ్యాయి. 50 మంది వరకు ప్రాణాలు కోల్పోగా వందలాది మూగజీవాలు చనిపోయాయి. వేలాది ఎకరాల భూములు వరదలపాలయ్యాయి. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. చెన్నై-ముంబై వెళ్లే రైల్వేలైను కొట్టుకుపోయింది. కడప-చెన్నై జాతీయ రహదారి నీటిపాలైంది. 3 లక్షల క్యూసెక్కుల నీటికే ఇంత నష్టం జరిగినప్పుడు.. జగన్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులో 8 లక్షల క్యూసెక్కులు 21 గేట్లు ఏర్పాటు చేయనున్నట్లు, రూ.800 కోట్ల వరకు ఖర్చు చేయనున్నట్లు, వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు చకచకా నివేదికలు తయారు చేశారు.

అందరికీ మేలు చేకూరేలా..

చెయ్యేరునది పరీవాహక ప్రాంతాలైన పెనగలూరు, పుల్లంపేట, నందలూరు వాసులకు తరతరాలుగా సుమారు 30 ఊట కాలువల ద్వారా 20 వేల ఎకరాలకు నీరు అందుతూ ఏడాదిలో మూడు పంటలు పండేవి. అటువంటిది ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు కట్టడం వల్ల కేవలం ఆకేపాడు, పుల్లంపేట, ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలకే ఈ నీరు అందేది. దిగువ ప్రాంతాలైన మూడు మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో లోతట్టు మండలాలైన నందలూరు, రాజంపేట, పెనగలూరుకు చెందిన వందలాది గ్రామాల భూములకు నీరందేలా ప్రాజెక్టు డిజైన్ చేయాలని పలువురు కోరుతున్నారు. అటు ఎగువ ప్రాంతాలకు, ఇటు దిగువ ప్రాంతాల్లోని రైతులందరికీ నీరందేలా కాలువలు ఏర్పాటు చేస్తూ ప్రాజెక్టు పునర్నిర్మిస్తే తప్ప ఇక్కడి ప్రజలందరికీ మేలు చేకూరదు. ఏది ఏమైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన జలవనరుల శాఖ అధికారులు ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణంపై చర్చించనుండటం శుభపరిణామమని చెప్పవచ్చు.

ప్రజలు సంతృప్తి చెందేలా
వైద్య సేవలందించాలి : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్ర జ్యోతి): ప్రజలు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట ల్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో హెల్త్ పారామీటర్స్, వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులు, ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డయాబెటిస్, హైపర్ టెన్షన్ మెటర్నల్ హెల్త్, నియోనేటల్ హెల్త్ అభ ఐడీ మ్యాపింగ్, తదితర అంశాల్లో అన్ని పీహెచ్‌సీలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనిచేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు ప్రజలతో మానవతా దృక్పథంతో మెలగాలని, తమ సిబ్బందికి కౌన్సెలింగ్ చేసి స్నేహపూర్వకంగా మెలిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య, డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్, ప్రోగ్రాం అధికారి బీఎస్‌కే డాక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్లు జైలు శిక్ష

● రూ.5 వేలు జరిమానా


నిందితుడు చంద్రశేఖర్

మదనపల్లె అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడు చంద్రశేఖర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. పోలీసులు వివరాల మేరకు.. మదనపల్లెకు చెందిన చంద్రశేఖర్ 2017లో మదనపల్లె పట్టణం, బాలికల హైస్కూల్ వద్ద ఆడపిల్లలను చూసి మూత్ర విర్జన చేయడం, అసభ్యకరంగా సైగలు చేస్తుండగా గమనించిన అప్పటి హెచ్‌ఎం పద్మజ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు పోక్సో కేసును నమోదు చేశారు. ఈ కేసును అప్పటి మదనపల్లె వన్‌టౌన్ ఎస్‌ఐ మనోహర్ విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో శుక్రవారం చిత్తూరు పోక్సో కోర్టు విచారణ చేపట్టి పోక్సో జడ్జి శంకరరావు, స్పెషల్ పీపీ మోహన్‌కుమారి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా విధించి, రిమాండ్‌కు తరలించారు. ఇందులో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, కోర్టు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి యల్లమ్మ జాతర

● నాలుగు రోజులు వైభవంగా జరుగనున్న కార్యక్రమాలు
● జిల్లాలో ఇదే చివరి జాతర


ఆలయంలో ప్రత్యేక అలంకారంలో యల్లమ్మ

కలికిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. నాలుగు రోజులపాటు వివిధ కార్యక్రమాలతో భక్తులను అలరించనుంది. జిల్లాలో ప్రతి ఏడాది మదనపల్లె మండలంలోని సీటీఎం జాతర మొదటిది కాగా చివరిది యల్లమ్మ జాతర. ఈ కారణంగా జిల్లాలోని భక్తులే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. శనివారంతో ప్రారంభయ్యే జాతర మంగళవారంతో ముగుస్తుంది. మూడు వారాలపాటు కలికిరి, రెడ్డివారిపల్లె గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి పూజలందుకున్న అమ్మవారి సోలెం శుక్రవారం రాత్రికి ఆలయం చేరుకుంటుంది. ఆ తరువాత శనివారం ఉదయం వివిధ సాంప్రదాయ కార్యక్రమాలు పూర్తి చేసుకుని రాత్రి జాగరణ, అమ్మవారి కథాకాలక్షేపం జరుగుతుంది. ఆదివారం ఉదయం అమ్మవారు ప్రత్యేక రథంలో గ్రామ పర్యటన చేయనున్నారు. తరువాత సిద్ధపూజ, సాయంకాలం బోనాలు, రాత్రి విశేష అలంకారాలతో రంగురంగుల విద్యుద్దీపాలతో చాందినీ బండ్లు ఈ జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

వాహనాలు దారి మళ్లింపు

యల్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం నుంచి మూడు రోజులపాటు వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు కె.రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు నుంచి కలికిరి మీదుగా వెళ్లాల్సిన వాహనాలు కందూరు వద్ద వలిగట్ల మార్గంలో వెళ్లాలని, పుంగనూరు వెళ్లాల్సిన వాహనాలు పీలేరు చదుం మీదుగా దారి మళ్లించాలని కోరారు. జాతర బందోబస్తు కోసం డీఎస్పీ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, 200 మంది సిబ్బందితో పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కాగా చాందినీ బండ్లు ఏర్పాటు చేసే భక్తులు ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఇక పీలేరు నియోజకవర్గంలోని పరిసర గ్రామాల ప్రజలు జాతరకు హాజరయ్యేందుకు పీలేరు డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపనున్నారు.


సాకులు చూపి కోతలు

● గృహ నిర్మాణ పథకంలో జిల్లాలో 7652 మంది అనర్హులుగా గుర్తింపు
● లబోదిబోమంటున్న లబ్ధిదారులు 6

కమనీయం.. సౌమ్యనాథుడి కల్యాణం

● హరినామస్మరణతో పులకించిన ఆలయం
● తరలివచ్చిన భక్తజనం


మాంగల్యధారణ చూపుతున్న ఆగమశాస్త్ర పండితులు


గజవాహనంపై సౌమ్యనాథస్వామి

నందలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు అయిన శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణం చూడముచ్చటగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యాణ వేదికను అలంకరించారు. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్ కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామిలు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలకు ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కల్యాణ వేదికపైన ఆశీనులు గావించారు. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణలతో ఆలయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాల క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగా స్వామివారి కల్యాణ వేడుకకు రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డిలు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు

కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలందించారు. కల్యాణం అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామిని పల్లకిలో ఊరేగించి మాడవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, జనసేన నాయకుడు శ్రీనివాసరాజు, రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అధికారి కృష్ణ, ప్రముఖ డైరెక్టర్ తోట వేణుగోపాల్, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

గజవాహనంపై సౌమ్యనాథస్వామి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజున శుక్రవారం రాత్రి గజ వాహనంపై సౌమ్యనాథస్వామి పురవీధుల్లో విహరించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణానికి హాజరైన భక్తులు

కుటుంబ ఆరోగ్యమే దేశ సౌభాగ్యం

● డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య


రాయచోటిలో నేతాజీ సర్కిల్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

రాయచోటిటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకొంటున్నామని, అందులో భాగంగా ఈ సంవత్సరం ప్రణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం అవసరం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లి కావడానికి సరియైన వయస్సుతో పాటు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే గర్భధారణకు అనుకూలమని తెలిపారు. తల్లీ, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు, బిడ్డకు మధ్య గ్యాప్ అవసరం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు అంతటా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం డీపీహెచ్‌ఎన్‌వో ఇన్‌చార్జి బలరామరాజు మాట్లాడుతూ టీఎఫ్‌ఆర్ రేటును పెంచే విధంగా అర్హులైన దంపతులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ నినాదాలు చేయిస్తూ ప్లకార్డులు ప్రదర్శన చేస్తూ ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో కిరణ్, డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎన్‌ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, యూపీహెచ్‌సీ వైద్యులు, ఎస్‌వో ఓబుల్‌రెడ్డి, డీఎస్‌వో కరీముల్లా, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ బలరామరాజు, మహమ్మద్ రఫీ, రాజగోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాక

వాల్మీకిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఉదయం వాల్మీకిపురం మండలంలోని కంభంవారిపల్లెకు రానున్నారు. కంభం ప్రభాకర్‌రెడ్డి మరణవార్త తెలుసుకున్న తక్షణం ఆయన ఫోన్ ద్వారా ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబీకులకు ఓదార్పు చెప్పారు. కాగా శనివారం ఉదయం జరగనున్న ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియలకు నేరుగా ఆయన హాజరు కానున్నారు.

దాడిపై కేసు నమోదు

సుండుపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిచెరువుకు చెందిన వరుణ్‌పై దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మడితాడు గ్రామంలో కారులో వస్తుండగా కొంత మంది యువకులు కారును అడ్డుకొని కర్రలతో దాడి చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సుండుపల్లె మండలానికి చెందిన సుమారు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అల్లర్లు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెల్నెస్ సెంటర్‌తో వెలుగు

- అంతర్జాతీయ గుర్తింపు పొందనున్న హార్సిలీహిల్స్
- పెరగనున్న పర్యాటకుల సంఖ్య
- మెరుగుపడనున్న మౌలిక సదుపాయాలు

బి.కొత్తకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌కు వెల్నెస్ సెంటర్‌తో వెలుగు రానుంది. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ యోగా గురువు పతంజలి సంస్థ వ్యవస్థాపకుడు రాందేవ్‌బాబాను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి సంస్థ కార్యకలాపాలు సాగించాలని అందుకు తగిన వెసులుబాటు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. అందుకు రాందేవ్‌బాబా కూడా సానుకూలంగా స్పందించి ఇటీవల రాష్ట్రంలో తన బృందంతో పర్యటించి కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబుతోనూ సమావేశమయ్యారు. ఇప్పటికే దేశ విదేశాల్లో నిర్వహిస్తున్న వెల్నెస్ సెంటర్ తరహాలో రాష్ట్రంలోనూ ఏర్పాటుకు ముందుకొచ్చారు. అందులో సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి అందాలు కలిగి వున్న హార్సిలీహిల్స్ ఒకటి.

హిల్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు..

పతంజలి సంస్థకు దేశవ్యాప్తంగా హరిద్వార్ (ఉత్తరాఖండ్), నోయిడా, మోదీనగర్ (ఉత్తరప్రదేశ్), గౌహతి (అస్సాం), పానిపట్ (హర్యానా), పూణే (మహారాష్ట్ర), జబల్‌పూర్ (మధ్యప్రదేశ్), ఆనంద్ (గుజరాత్) తదితర ప్రాంతాల్లో వెల్నెస్ సెంటర్లు ఉన్నాయి. అయితే వాటిలో హిల్‌స్టేషన్ లేదు. హార్సిలీ హిల్స్‌లో కనక ఏర్పాటైతే దానికో ప్రత్యేకత ఉండబోతోంది. దేశ విదేశాల నుంచి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలోనే మదనపల్లెకు మినీ ఎయిర్‌పోర్ట్ తీసుకువస్తామని రాకపోకలకు సౌకర్యాలు కల్పిస్తామని స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. హార్సిలీహిల్స్‌లో రూ.200 కోట్లతో ఒబెరాయ్ సంస్థకు ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కేటాయించినా ప్రాజెక్టు స్థాపన



ఆలస్యం అవుతోంది. దీంతో వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం దారులు తెరిచినట్లు తెలుస్తోంది.

వెల్నెస్ సెంటర్‌తో సాంత్వన

శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు, సమగ్ర ఏకీకరణ, మానసిక ప్రశాంతత, మనస్సును నిమగ్నం చేసి సాంత్వన పొందటమే వెల్నెస్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యం. బీపీ, థైరాయిడ్, మధుమేహం లాంటి రుగ్మతలకు ప్రకృతి వైద్యం, ఆయుర్వేద మందులు, యోగా ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. పరిస్థితిని బట్టి ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకొని సంస్థ నిబంధనల మేరకు సేవలు పొందవచ్చు. పర్యాటక పరంగా ఆదాయం ఉన్నప్పటికీ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని హార్సిలీహిల్స్‌లో మౌలిక సదుపాయాలు, భద్రత, సుందరీకరణతో మెరుగుపడుతుందని పలువురు భావిస్తున్నారు.

14న మంత్రుల పర్యటన

కురబలకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14న మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డిలు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంగళ్లు, ముదివేడు క్రాస్, దాదాంవారిపల్లె పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాగా కడప క్రాస్ పంచాయతీ ఒంటిల్లు తూర్పు హరిజనవాడ వద్ద ఆర్‌డీ ఎస్ రూ.30 లక్షల నిధులతో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవం, ముదివేడు కేజీబీవీలో రూ.11లక్షల నిధులతో పాఠశాల భవన నిర్మాణం శంకుస్థాపన, దాదంవారిపల్లె పంచాయతీలో రూ.10 లక్షల ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, గొళ్లపల్లెలో రూ.21 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, అంగళ్లు పంచాయతీ టెర్రకోట వద్ద డీఆర్‌డీఏ నిధులతో నిర్మించిన కామన్ ఫెసిలిటి కేంద్రం ప్రారంభం, అంగళ్లు పంచాయతీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, రూ.80 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సచివాలయం, రైతుసేవా కేంద్రం, ప్రహరీ, అంగళ్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.10లక్షల నిధులతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష

రామసముద్రం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువడినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. రామసముద్రం-మదనపల్లె రోడ్డులో ఓబి నాయనపల్లె బస్ షెల్టర్ వద్ద 6-10-2012న ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వనగానిపల్లెకు చెందిన రామప్ప మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఏటవాకిలి గ్రామానికి చెందిన వైవీ చెంగారెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ నేపథ్యంలో 2018 నవంబరు 22 పుంగనూరు కోర్టు నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. దీన్ని సవాల్ చేస్తూ నిందితుడు మదనపల్లె కోర్టులో అప్పీలు చేసుకున్నాడు. అయితే శుక్రవారం కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మదనపల్లె కోర్టు కూడా అదే శిక్షను అమలు చేయాలని తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యానికి నడక మంచిదే



జెండా ఊపి ప్రారంభిస్తున్న ముంతాజ్‌అలి, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మానవుడి ఆరోగ్యానికి నడక మంచిదే అని పద్మభూషణ్ అవార్డు గ్రహీత ముంతాజ్ అలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సత్సంగ్ ఫౌండేషన్, స్వస్థ ఆస్పత్రి ఆధ్వర్యంలో 3 కి.మీ. వాకతాన్ నిర్వహించారు. ఈ వాకతాన్‌ను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర జెండా ఊపి ప్రారంభించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు 4 కి.మీ. నడిస్తే రోగాల పేరిట ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం వుండదన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వ్యాయామానికి ముందు నడక ఒక ఔషధంలా పనిచేస్తుందన్నారు. అనంతరం సత్సంగ్ ఆశ్రమం నుంచి 3 కి.మీ. పాటు విద్యార్థులు, ప్రజలు వాకతాన్ నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక, ఆరోగ్యమాత, సత్సంగ్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్దేశ్వర, చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం



గజ వాహనంపై ఊరేగుతున్న సిద్దేశ్వరస్వామి

రాజంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ఇలవేల్పు అయిన చెన్నకేశవ, సిద్ధేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గజ వాహనంపై సిద్ధేశ్వరస్వామిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో తాళ్లపాక గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్టీసీతోనే యూనియన్ ఆవిర్భావం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య
- వన్ అండ్ టూ డిపోల గౌరవాధ్యక్షుడిగా నాగూర్‌వలి

మదనపల్లెఅర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): 1952లో ఆర్టీసీ సంస్థ ఆవిర్భావంతోనే యూనియన్ ఏర్పాటైందని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడిగా టీడీపీ నేత నాగూర్‌వలిచే ప్రమాణం చేయించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు రాష్ట్ర, జిల్లా నేతలు కలిసి సన్మానించారు. అంతకముందే కొమటివాని చెరువు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించి ర్యాలీగా మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ చేరుకున్నారు. సీఏ బాబు సభాధ్యక్షతన నిర్వహిస్తున్న సభలో ఆయన మాట్లాడుతూ కార్మిక నేత సుధాకర్, మలిశెట్టి దామోదర్ జీతాల పెంపుకోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం రాష్ట్ర నేత మలిశెట్టి దామోదర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమార్‌లు మాట్లాడారు. నూతన గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ అందరి సహకారంతో ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణప్ప, మురళి, జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, కల్యాణ్, సురేంద్ర, టీడీపీ నేతలు ఖాదర్‌ఖాన్, సుధాకర్, రామమూర్తి నాయుడు, లక్ష్మన్న, వెంకటరమణారెడ్డి, మధుబాబు, మేస్త్రీ రామకృష్ణ, ఐదు డిపోల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్టీసీ మహిళ ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలిని సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

చౌకదుకాణంపై విజిలెన్స్ దాడులు




తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సంబేపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరెడ్డి పల్లె గ్రామం షాప్ నెంబర్-1 పేయల వాండ్లపల్లె చౌక దుకాణంపై విజిలెన్స్ అధికారులు గీతావాణి, ఖాజా హుస్సేన్ శుక్రవారం తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డితో కలిసి దాడులు నిర్వహించారు. చౌకదుకాణంలో ఉండాల్సిన స్టాక్ కన్నా తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి షాప్ నెంబర్-1 సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందించాల్సిన నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్ఐ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

చౌకదుకాణంపై విచారణ

సిద్దవటం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె చౌకదుకాణంలో రేషన్‌దారులకు సక్రమంగా నిత్యావసర వస్తువులు అందడం లేదని, మరికొన్ని అక్రమాలు జరుగుతున్నాయని కొందరు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం పి.కొత్తపల్లె రేషన్‌షాపు-4పై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య మాట్లాడుతూ చౌకదుకాణం-4లో రేషన్ లబ్ధిదారునికి 5కిలోలు అందించాల్సి ఉండగా నాలుగు కిలోలు ఇస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్‌బాబు, వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేరళ పోలీసుల అదుపులో మదనపల్లె యువతి

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైనం

మదనపల్లె అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె యువతిని కేరళ పోలీసులు అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణం నక్కలదిన్నెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నక్కలదిన్నె వాసి సాయిబాబా కుమార్తె రోహిణి (27) 2023లో కేరళ రాష్ట్రం ముక్కంలో ఇతరులను మోసం చేయడంతో అక్కడి పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈమె తప్పించుకుని తిరుగుతూ కొద్ది రోజులుగా మదనపల్లెలో ఉంటోంది. సమాచారం తెలుసుకున్న కేరళ పోలీసులు శుక్రవారం నక్కలదిన్నెలో ఇంటి వద్ద అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె విషద్రావణం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అరెస్టు చేసి కేరళకు తరలించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పించాలి

రాజంపేటటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల ఫీజుల్లో రాయితీ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, తాలుకా అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏపీయూడబ్ల్యూజే రాజంపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంఈవో రఘునాథరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట మండల కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల ఫీజుల్లో 50శాతం మేరకు రాయితీ ఇవ్వాలని, కలెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వులను ప్రైవేటు పాఠశాలలు విధిగా అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు మలిశెట్టి సుబ్బరాయుడు, త్రివిక్రమ్, రాజంపేట ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాణ్, శ్రీహరి, వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్ర, ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై రహస్య విచారణ

సిద్దవటం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత పాలన వైసీపీలో ఆర్పీ సంస్థ అడ్డుగోలుగా నిబంధనలు ఉల్లంఘించి గుత్తేదారుని సమయం గడిచినా ఇసుక తవ్వకాలు జరపడంపై పెన్నానదిలో హద్దులు మీరి తవ్వకాలు, మరొకచోట జరిపి కోట్ల రూపాయలు అడ్డుగోలుగా సంపాదించిన ఇసుక బకాసురులపై రహస్య విచారణ జరుగుతోంది. ఈ రహస్య విచారణ విజయవాడ ఏసీబీ అధికారులు జ్యోతి, వంతాటిపల్లె, జంగాలపల్లె, మూలపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. సిద్దవటం మండలంలో వైసీపీ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల్లో వైసీపీ ప్రజాప్రతినిధుల ప్రమేయం ఎంతవరకు ఉంది, మరెవరెవరు ఈ ఇసుక కుంభకోణాల్లో ఉన్నారు పూర్తిగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

ఆ మూడు.. సారారహిత గ్రామాలు



సీటీఎం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మదనపల్లెటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని సీటీఎం, పోతబోలు, ములకలదిన్నె గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు ప్రజలతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా నాటుసారా తయారీని వదిలేసిన ప్రజలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందన్నారు. దీని వలన వారి జీవన విధానం మారి సమాజంలో గౌరవంగా బతకవచ్చన్నారు. అందుకే ఈ మూడు గ్రామాల్లో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు, సేవించరాదన్నారు. అలాగే పాత నిందితులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నామన్నారు. ఇక మీదట ఈ మూడు గ్రామాల్లో నాటుసారా విషయమై సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, హెచ్‌సీ వీరనాగయ్య, పీసీలు రేఖ, శివరాణి, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వన్యప్రాణి మృతి



మృతి చెందిన వన్యప్రాణి

రావనాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు సమీపంలో శుక్రవారం రోడ్డు దాటుతున్న వన్యప్రాణిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి భరణికుమార్ తెలిపారు. మృతిచెందిన జింకను పోస్టుమార్టం నిమిత్తం రామాపురం పశువైద్యశాలకు తరలించి, అనంతరం అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లి దహనం చేసినట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లెటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఆంధ్రలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ బీఎంపీపీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వేకువజామున బీఎంపీపీ సీఐ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో బెంగళూరు రోడ్డులోని చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కురబలకోట మండలం తుంగావారిపల్లెకు చెందిన ఎం.చంద్ర కుమారుడు ఎం.రమేశ్(27) కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంలో 96 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేశారు. తుంగావారిపల్లెకు చెందిన పి.రామచంద్ర కుమారుడు పి.సోమశేఖర్(20) వద్ద 48 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు నిమిత్తం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.



మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

సాకులు చూపి కోతలు

- గృహనిర్మాణ పథకంలో జిల్లాలో 7652 మంది అనర్హులుగా గుర్తింపు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

పట్టాదారుని పేరు : మద్దిరాల వీరయ్య
తండ్రి/ భర్త పేరు : చిన్న వెంగయ్య
ఖాతా నెంబరు : 903 సర్వే నెం. : 596-3
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 1.63
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ :
1

పట్టాదారుని పేరు : మద్దిరాల వీరయ్య
తండ్రి/ భర్త పేరు : చిన్న వెంగయ్య
ఖాతా నెంబరు : 903 సర్వే నెం. : 607
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 2.05
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ :
2

వెబ్‌ల్యాండ్‌కు సంబంధించిన వీరయ్య వివరాలు

సంబేపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేదవాడి గృహ నిర్మాణ పథకం (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పక్కా గృహాల నిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 44609 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసే సమయంలో లేని నిబంధనలను చూపుతూ సాకుల పేరుతో కోతలు పెట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 7652 మంది అనర్హుల జాబితాను విడుదల చేశారు. సంబేపల్లె మండలంలో 307 మంది అనర్హులుగా గుర్తించినట్లు తెలియజేశారు. అయితే ఈ జాబితాలో చాలా మంది అర్హులు ఉన్నట్లు చెబుతున్నారు. వారికి 10 ఎకరాల పొలం లేకపోయినా వారి పేరిట ఉందని, గృహ అవసరానికి వాడుతున్న కరెంటు తక్కువ వాడుతున్నా 300 యూనిట్లు వాడుతున్నారని, ఫోర్‌వీలర్ వాహనాలు లేకపోయినా ఉన్నట్లు ఇలా సాకులు చూపి అనర్హులుగా గుర్తించడంతో నిజమైన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

కరెంటు ఎక్కువ వాడినట్లు చూపించారు

- ఎం.ధనలక్ష్మి, పెద్దజంగపల్లి, దుద్యాల గ్రామం



ఈమె పేరు ధనలక్ష్మి. ఊరు దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లి. ఆమె ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో అన్ ఎలిజిబుల్ జాబితాలో ఆమె పేరు ఉంది. కారణం ఆమె 300 యూనిట్లు కరెంటు వాడుతున్నట్లు చూపారు. అయితే ఆమె ఇంటి సర్వీస్ నెంబర్ 2412663 000191కు సంబంధించి ఇప్పటి వరకు ఎప్పుడూ 300 యూనిట్లు దాటిన పరిస్థితి లేదని చెబుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పరిశీలించి అర్హులుగా గుర్తించాలని కోరుతోంది.


అర్హులకు న్యాయం చేస్తాం

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య

ప్రధానమంత్రి ఆవాస యోజన జాబితాలో అన్ ఎలిజిబుల్ అభ్యర్థుల జాబితాను ఇటీవల విడుదల చేశాం. అందులో అనర్హుల పేర్లను ప్రకటించి తెలియజేశాం. అర్హులైన వారు సంబంధిత అధికారుల వద్ద ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే మంజూరు కోసం తిరిగి జాబితాను పంపుతాం. సమస్యపై విచారించి పై అధికారులతో మాట్లాడి అర్హులకు తప్పకుండా న్యాయం చేస్తాం.

పది ఎకరాలు ఉన్నట్లు చూపుతున్నారు

- వీరయ్య, పెద్దజంగంపల్లి, దుద్యాల



ఈయన పేరు మద్దిరాల వీరయ్య. ఖాతా నెంబర్ 903 వెబ్‌ల్యాండ్‌లో 3.68 ఎకరాల పొలం ఉంది. వారి కుటుంబ సభ్యులందరికీ కలిపి ఉన్న పొలం ఇదే. అయితే ఆయనపై 10 ఎకరాలపైన పొలం ఉన్నట్లు చూపిస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 5 ఎకరాల్లోపు పొలం ఉన్నా పది ఎకరాలు ఉన్నట్లు జాబితాలో చూపించడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించినా 3.68 సెంట్లు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా నిజమైన అర్హులను గుర్తించి గృహ నిర్మాణం మంజూరు చేయాలని కోరారు.



జాతీయ రహదారి పనుల్లో భాగంగా విశ్వనాథపురం గ్రామం వద్ద కేసీ ఉపకాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి, సిమెంటు పైపులు వేసి తాత్కాలికంగా వేసిన రోడ్డు

నీళ్లు పారేదెలా...!

కేసీ నీటికి అడ్డంకిగా... జాతీయ రహదారి నిర్మాణ పనులు

చాపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ సాగునీటికి జాతీయ రహదారి నిర్మాణ పనులు అడ్డంకిగా మారాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా బెంగుళూరు-అమరావతి జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా మండలంలోని విశ్వనాథపురం గ్రామం వద్ద కేసీ కెనాల్‌కు ఉపకాలువ అయిన ఏటూరు కాలువపై బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. కాలువలో పెద్ద సిమెంటు పైపులు వేసి పైన తాత్కాలికంగా రోడ్డు వేశారు. ఈరోడ్డుపై ప్రతిరోజు కొన్ని వేల వాహనాలు తిరుగుతుంటాయి. ఈ పైపుల్లో ఒకపైపు పగిలిపోయింది. దీంతో కేసీ కాలువకు సాగునీరు వదిలితే కింద భూములకు పోయేందుకు అవకాశం లేదు. నీటి ప్రవాహానికి రోడ్డు కోసుకుపోయే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ కాలువ పరిధిలో సుమారు 8 వేల ఎకరాల భూములు ఉన్నాయి. విశ్వనాథపురం, అల్లాడుపల్లె, రాజకొట్టాలు, సన్నపల్లె, గాంధీనగర్ తదితర గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం జూలై నెల పంటలు సాగు చేసేందుకు మంచి అదును. అదే సమయంలో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ప్రతి ఏడాది అధికారులు సాగునీటిని కేసీ కెనాల్‌కు వదులుతారు. ఈ కెనాల్ ద్వారా వచ్చే సాగు నీరు తమ పొలాలకు అందాలంటే నేషనల్ హైవే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

'జనాభా పెంచాలని సీఎం చెప్పడం విడ్డూరం'

వేంపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ మంది పిల్లల్ని కనండి, జనాభా పెరగాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పడం విడ్డూరమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. 1990 జూలై 11న ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా దినంగా ప్రకటించిందన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినం లక్ష్యమన్నారు. ప్రపంచ జనాభా 809 కోట్లు అయితే భారత్ జనాభా 144 కోట్లతో మొదటి స్థానంలో ఉందన్నారు. అటు జనాభా, ఇటు జన సాంద్రత విషయంలో భారత్ ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికే కనీస అవసరాలు, ఉపాధి, ఉద్యోగాలు లభించక మద్యం, గంజాయి, డ్రగ్స్‌లకు బానిసలై అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారన్నారు. కావున జనాభా విషయంలో ముఖ్యమంత్రి తన అభి ప్రాయం మార్చుకోవాలని సూచించారు.

రేపు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమీక్ష సమావేశం

కడప క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కడప సీఎస్ఐ చర్చి వద్ద ఈ నెల 13న ఆదివారం ఉదయం 9.30 గంటలకు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దాసరి రమణయ్య, కెప్టెన్ రాముడు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో ఇళ్ల స్థలాలు, రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది సమస్యలు, సంక్షేమంపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి హాజరు కావాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

లింగాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరోపణలు రావడంతో పులివెందుల డీఎల్డీఓ విజయలక్ష్మి విచారణ చేపట్టారు. శుక్రవారం లింగాల మండల పరిషత్ కార్యాలయంలో ఆమె రికార్డులను పరిశీలించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.40లక్షలు ఏమయ్యాయో.. వాటిని ఏ అభివృద్ధి పనులకు ఉపయోగించారో అర్థం కావడం లేదు. కాగా గత నెలలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో మండలాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై జడ్పీ సీఈఓ ఓబుళమ్మ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల మండలానికి సంబంధించి నిధులను ఎందుకు ఖర్చు చేయలేదని అడగడంతో అధికారులు తమ ఖాతాలలో ఉన్న నిదులను ఖర్చు చేశామని చెప్పారు. అయితే జడ్పీ రికార్డులలో నిధులు ఖర్చు కాకుండా అలాగే ఉన్నట్లు చూపడంతో, రికార్డులకు అధికారులు చెప్పేలెక్కలకు పొంతన లేకపోవడంతో జడ్పీ సీఈఓ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు పులివెందుల డీఎల్‌డీఓ నిధుల వినియోగంపై విచారణ చేపట్టారు. అప్పటి ఎంపీడీఓలు సురేంద్రనాథ్, తేజోష్ణ, ఏఓ లోకేష్ విచారణకు హాజరయ్యారు. ఆ మేరకు డీఎల్డీఓ అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను సోషల్ ఆడిట్ కోసం ఉంచాలి

● జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్

కమలాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను తప్పనిసరిగా సోషల్ ఆడిట్ కోసం ఉంచాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం కమలాపురం డివిజన్ పరిధిలో రైతు సేవ కేంద్ర సిబ్బందికి ఏడీఏ నరసింహారెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రైతుసేవ కేంద్ర సిబ్బంది వ్యవసాయశాఖలోని పథకాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా తప్పనిసరిగా సోషల్ ఆడిట్ కోసం ఉంచాలని, జాబితాలో పేరు లేని రైతులు రైతుసేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి గ్రీవెన్స్ ఇవ్వాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాలలో నిర్వహించాలని, ఆయా గ్రామ రైతులందరికీ ఆర్ఎస్‌కే సిబ్బంది తెలపాలన్నారు. పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు, రైతుసేవ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ సెమిస్టర్ పరీక్షలు

తొలి రోజు 96శాతం మంది హాజరు



పీజీ పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, సీఈ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాల, అనుబంధ పీజీ కలాశాలల రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 96శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 674 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6503 మంది (96శాతం) హాజరయ్యారు. 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈపరీక్షలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప ఎస్వీ పీజీ కళాశాల, ప్రొద్దుటూరు ఎస్వీఎస్ఆర్ పీజీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను పంపామని, ప్రత్యేకంగా హైపవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి కేసులో హైకోర్టు ఉత్తర్వులు

● 41 నోటీసు ఇచ్చి విచారణ చేయాలని సూచన

● 11 మందిని కోర్టుకు పంపగా వెనక్కి పంపిన జడ్జి

వేంపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో బాలిక అదృ శ్యంపై జరిగిన నాటకీయ పరిణామాలలో బాలిక తరపు బంధువులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన వారు హైకోర్టును ఆశ్రయించారు. బాలిక అదృశ్యం కావడంతో పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లామని అక్కడ తోపులాటలో పోలీస్‌స్టేషన్ అద్దాలు పగిలిపోతే హత్యాయత్నం కేసు నమోదు చేశారని హైకోర్టులో పిటీషన్ వేయగా.. 41 నోటీసు ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవాలని శుక్రవారం హైకోర్టు జడ్జి ఆదేశించారు. కాగా, వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన కేసుకు సంబంధించి 12 మందితో పాటు మరో 150 మందిపై కేసు నమోదైంది. ఇందులో నిందితులుగా ఉన్న హుస్సేన్ మరో 12 మందిని అరెస్టు చేసి శుక్రవారం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరిచారు. ఈలోగా హైకోర్టు 41 నోటీసుతో విచారించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో నిందితులను విచారించి తదుపరి చర్యలు తీసుకోవాలంటూ జమ్మలమడుగు జడ్జి ఆదేశించినట్లు సీఐ నరసింహులు తెలిపారు. దీంతో జమ్మలమడుగు కోర్టులో హాజరుపరిచిన 11 మందిని వెనక్కి పిలిపించి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విచారణలో వారు చెప్పిన వివరాలను కోర్టుకు సమర్పించిన తర్వాత కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటటామని సీఐ తెలిపారు. కాగా ఈ కేసులో ఇప్పటికే చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. హైకోర్టు ఉత్తర్వులతో వారందరికి ఊరట లభించింది. నోటీసు ఇచ్చి విచారించిన తర్వాతే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

పులివెందుల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో గాయపడిన శివశంకర్‌రెడ్డి (58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని బాకరాపురానికి చెందిన శివశంకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిల మధ్య ఇంటి వద్ద ప్రహరీగోడ విషయమై వివాదం ఉండేది. ఈ నేపథ్యం లో జూన్ 30వ తేదీన ఘర్షణకు పాల్పడ్డారు. శివశంకర్‌రెడ్డిపై పవన్ కుమార్‌రెడ్డి అతని కుమారుడు సందీప్ రెడ్డిలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అతన్ని కుటుంబ సభ్యులు కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున శివశంకర్‌రెడ్డి మృతి చెందారు. ఈ మేరకు పవన్‌కుమార్‌రెడ్డి, సందీప్‌రెడ్డిలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, విచా రణ సాగిస్తున్నామని ఏఎస్ఐ సిద్దార్థ తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

మైదుకూరురూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామ సమీపంలో గురువారం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరికి శుక్రవారం మైదుకూరులో అంత్యక్రియలు నిర్వహించారు. మృతులు మైదుకూరు పట్టణం మహబూబ్‌నగర్‌కు చెందిన షేక్ కమాల్‌బాషా(50) పటాన్ మున్ని(40), మాబుచాన్, నాసియా (3 నెలలు)కు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం మృతదేహా లను మైదుకూరుకు తీసుకువచ్చి బంధువులు, స్థానికులు కలిసి అశ్రునయనాల మధ్య అంతక్రియలు నిర్వహించారు. కాగా హైదరాబాద్‌కు విహారయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వీరు మృతి చెందిన విషయం తెలిసిందే.

ఆటో తగిలి చిన్నారి మృతి

ఖాజీపేట జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూలవారిపల్లెలో పాల ఆటో తగిలి అంజలి (3) అనే చిన్నారి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. మూలవారిపల్లెకు చెందిన రామ్మోహన్ కుమార్తె అంజలి రోడ్డుపై ఉండగా పాల ఆటో తగలడంతో టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాటర్ ట్యాంక్‌పడి దెబ్బతిన్న నివాస గృహం



కూలగొట్టే క్రమంలో.. ఇంటిపై పడిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కాశినాయన, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావిశెట్టిపల్లెలో శుక్రవారం శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను కూలదోస్తుండగా సమీపంలోని నివాస గృహంపై పడింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామం నడిబొడ్డున ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామస్థులు ట్యాంక్‌ను వినియోగించక ఇది శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం దీనిని కాంట్రాక్టర్ కూలగొట్టే క్రమంలో వెంకటసుబ్బయ్య ఇంటిపై పడింది. దీంతో ఆ ఇల్లు కొంత భాగం దెబ్బతింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఓబయ్యను వివరణ కోరగా కూలగొట్టమని తాము ఎవరికీ చెప్పలేదన్నారు. దీనిపై విచారించి పైఅధికారుల దృష్టికి తీసుకపోయి చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసుల విచారణకు వచ్చి...

బద్వేలుటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాల కేసులో విచారణకు హాజరయ్యేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన నకిలీ ఇంటిపట్టాల కేసులో పలువురిని పోలీసులు విచారిస్తున్నారు. ఈక్రమంలో బయనపల్లెకు చెందిన పిల్లి భాస్కర్‌ను విచారణ నిమిత్తం గత వారం రోజులుగా ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాత్రి ఇంటికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం విచారణ నిమిత్తం స్టేషన్‌వద్దకు వచ్చిన పిల్లి భాస్కర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించి.. మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

భూకబ్జాల విషయంలో ఎవరినీ ఉపేక్షించవద్దు

● బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి



బద్వేలుటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భూకబ్జాలు, నకిలీ పట్టాల విషయంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్న నేపథ్యంలో కొన్ని ప్రచార మాధ్యమాల్లో టీడీపీ వ్యక్తుల ప్రమేయం ఉందని వస్తున్న ఆరోపణలపై నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి స్పందించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూకబ్జాలు, నకిలీ పట్టాల విషయంలో ఎంతటి వారినైనా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీ సుశాఖ అధికారులను కోరారు. బద్వేలులో గత వైసీపీ ప్రభుత్వంలోనే అనేక మంది భూకబ్జాలకు పాల్పడ్డారని స్వయంగా తానే ప్రజలకు తెలియజేశానన్నారు. అలాంటి వారిని ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కబ్జాదారులను విచారిస్తూ చర్యలను తీసుకుంటున్నారన్నారు. చట్టానికి అందరూ సమానమేనని, పార్టీలకు అతీతంగా ఏ పార్టీకి చెందిన వారినైనా కఠిన చర్యలు తీసు కోవాల్సిందిగా ఆయన కోరారు.

ఆడిట్ బృందం తనిఖీలో లోపాలు

● ప్రతి పనిలో వేలెత్తి చూపడమే.. ● బతికి ఉన్నమొక్కలను చచ్చిపోయినట్లుగా చూపిన వైనం

పులివెందుల రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిన ఆడిట్ బృందం తనిఖీల్లో లోపాలు ఉన్నట్లు బట్టబయలైంది. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆడిట్ బృందం 2024-25 సంవత్సరంలో జరిగిన పనులు, ఖర్చుచేసిన వివరాలు తనిఖీ చేసి నివేదికలు తయారు చేసింది. ఎస్టిమేషన్ ప్రకారం పనులు జరిగాయా, ఉపాధి ద్వారా ఎక్కడెక్కడ ఏఏ పనులు చేశారు, ప్రజలకు ఉపయోగపడుతున్నాయా, నిధులు ఎంత వెచ్చించారు, ఖర్చు చేసినంత మేర పనులు జరిగాయా అనే తదితర వివరాలు నివేదికలు తయారు చేశారు. అయితే కొన్ని చోట్ల డకౌట్ పాండ్ జరిగిన పనుల్లో లోతు, పొడవు, వెడల్పు నిబంధనల ప్రకారం కాకుండా తక్కువగా జరిగాయని తాము పరిశీలించామని తనిఖీ బృందం వివరించింది. దీంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు సమాధానమిస్తూ ప్రతి పని పక్కాగా చేశామని, ఫొటోలు చూపించారు. మరికొన్ని చోట్ల డకౌట్ పాండ్స్ లోతు తక్కువగా తీశారని తనిఖీ బృందం తెలియజేయగా అక్కడ పెద్దరాయి ఉందని అందుకే అలా తక్కువగా తీయించామని, దీన్ని అంతా ఎంబుక్‌లో నమోదు చేశామని పీడీకి వివరించారు. అలాగే కసనపల్లెలో ఉపాధి కింద చీనీ మొక్కలు నాటుకున్నామని, అయితే తనిఖీ బృందం వారు 9 మొక్కలు చనిపోయినట్లు నివేదిక ఇచ్చారని ఓ రైతు తెలిపారు. ప్రతి పనిలోను ఏదొక వంకలు పెడుతున్నారని పలువురు చర్చించుకున్నారు. కాగా సామాజిక తనిఖీలో ఉపాధి సిబ్బంది లోపాలు బయటపడేవని, అయితే ఈసారి సామాజిక తనిఖీ బృందం తనిఖీల్లో లోపాలు బయటపడ్డాయని పలువురు అధికారులు, రైతులు చర్చించుకోవడం గమనార్హం.



డ్వామా పీడీ ఆదిశేషారెడ్డిని చుట్టుముట్టిన ఆడిట్ బృందం, ఉపాధి సిబ్బంది

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

జనాభా నియంత్రణపై అవగాహన ఉండాలి



సిద్దవటం మండలం పి.కొత్తపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దేవళంపల్లి వైద్యాధికారి జియావుల్లా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పెరగడం వలన ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, బిడ్డ పుట్టిన తర్వాత మూడు సంవత్సరాల వరకు రెండో బిడ్డకు గ్యాప్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో దేవదానం, సీహెచ్‌వో సరళాదేవి, సూపర్‌వైజర్ మణీ, ఏఎన్‌యంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటంలో ర్యాలీ

సిద్దవటం, జూలై 11(ఆంధ్ర జ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని పి.కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జనాభా పెరుగుదల వల్ల కలిగే కష్టనష్టాలపై ప్రజలకు వివరించారు. ఆడపిల్లకు సరైన వయస్సులో వివాహం చేయాలని, మహిళ తల్లి కావడానికి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం ఉండాలని, అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. ఆడపిల్లలకు చిన్నవయస్సులో వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీ, నరసమ్మ, సూపర్‌వైజర్‌లు లక్ష్మీదేవి, మౌలాలి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవంపై డాక్టర్ మనోజ్‌చంద్ర, డాక్టర్ శ్రీనిజ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ పాటిద్దాం, దేశ ప్రగతికి తోడ్పడుదామంటూ నినాదాలు చేశారు. డాక్టర్ మనోజ్‌చంద్ర మాట్లాడుతూ జనాభా పెరుగుదల దేశ ప్రగతికి అవరోధమన్నారు. ప్రతి ప్రసవానికి మధ్య తగినంత విరామం ఉండాలని, దీనివల్ల మాతాశిశు ఆరోగ్యానికి భరోసా ఉంటుందన్నారు. ర్యాలీలో సూపర్‌వైజర్ పి.మహేష్, కేవీ సుబ్బారెడ్డి, బీవీ క్రిష్ణయ్య, ప్రసన్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

15 లోగా ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలో చేరేందుకు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటారు మెకానికల్, డీజిల్, కంప్యూటర్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈనెల 21వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

పశుగ్రాస సాగు రైతుకు ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ ఉమ

ఒంటిమిట్ట, జూలై 11(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం సాగు చేస్తే రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుందని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఉమ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని రాచపల్లెలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పశుగ్రాసాన్ని సాగు చేసేందుకు ముందుకు రావాలన్నారు. పశుగ్రాసం సాగు పాడి రైతుల ఇంట సిరులు కురిపిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో అక్రమ కట్టడాన్ని కూలుస్తున్న దృశ్యం

సుండుపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం ఆక్రమించి అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాన్ని కోర్టు ఆదేశాల మేరకు తొలగించినట్లు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలోని బుర్రలదిన్నెపల్లిలో ఊరికి దక్షిణ భాగాన సర్వే నెంబర్ 395లో ఉన్న రహదారిని అదే ఊరికి చెందిన వ్యక్తి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి కావడంతో కొన్ని నెలల క్రితం ప్రజలు కోర్టును ఆశ్రయించారు. దీంతో జిల్లా సర్వేయర్లు కొలతలు వేసి నివేదికలను కోర్టుకు అందజేశారు. ఈ మేరకు అక్రమ నిర్మాణం తొలగించాలని కోర్టు ఆదేశించిందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటంలో వైద్యశిబిరం

సిద్దవటం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం బస్టాండు కూడలిలోని గంగమ్మ దేవాలయం పక్కన శుక్రవారం కడప పట్టణానికి చెందిన పాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధులు, మహిళల శస్త్ర చికిత్సలు, హెర్నియా, పైల్స్ ఉదరకోశ, థైరాయిడ్, గుండె, ఊపిరితిత్తులు, చిన్నపిల్లలకు వైద్యసేవలందించారు.

చెర్లోపల్లె గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



ఇంటింటి ప్రచారం చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె గ్రామ అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హెచ్.చెర్లోపల్లెలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లె గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమరంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, సతీష్‌రాజు, పార్లమెంట్ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులకు పేద విద్యార్థులను దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న రియింబర్స్‌మెంట్ డబ్బులు అధికారంలోకి వచ్చిన నెలలోపే విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామన్న హామీని ఏడాదికాలం పూర్తయినా ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాకపోవడంతో పైచదువులకు వెళ్లడానికి కావాల్సిన సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ భవిత, నాయకులు అహ్మద్, గణేశ్, సాయికిరణ్, నాగార్జున, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రైల్వేకోడూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో వెలసిన భువనేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రాహుకాల పూజలు చేసి అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు.

నోటు పుస్తకాల పంపిణీ

రైల్వేకోడూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మిశెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని పిట్లావాండ్లపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సామాజిక సేవా కార్యకర్త మందపాటి శంకరయ్య నోటు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాయకుడు తిరుపాలు, దేవరపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

అన్ని సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి

రాయచోటి(కలెక్టరేట్), జూలై11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్లకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రదాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ముబారక్, కోకన్వీనర్ నేలపాటి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్ర వారం కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ రంగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు, పార్క్ కూలీలకు, ఆఫీస్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా వేతనాలు పెంచి ఇవ్వాలని, మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, రిటైర్డ్ అయిన కార్మికుల గ్రాడ్యుటీ సత్వరం విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లి మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న డైలీ వేజెస్ పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు దేవా, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చలపతినాయుడు, శేషాద్రిబాబు, కేశవరావు, వెంకటేశ్, రాధా, చంద్ర, నరసింహులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా తప్పనిసరి

● జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్

వీరబల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా తప్పనిసరి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సానిపాయి గ్రామ సమాఖ్య-1 జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, సురక్షా బీమా ద్వారా రూ.4లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సంవత్సరానికి 18 నుండి 50 సంవత్సరాల వయస్సు గలవారు రూ.436 ప్రీమీయం చెల్లించాలన్నారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 సంవత్సరాల వరకు పొదుపు చేసుకొంటే ఆ తర్వాత రూ.1000 నుండి రూ.5 వేల వరకు ఫించన్ పొందవచ్చునన్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా పది సంవత్సరాల ఆడపిల్లలకు 14 సంవత్సరాల వరకు ప్రీమియం చెల్లిస్తే 18 సంవత్సరాల వయస్సు నాటికి చెల్లించిన మొత్తానికి మూడు రెట్లు అధిక మొత్తం వస్తుందన్నారు. అనంతరం సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీ కృష్ణయ్య, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ చంద్ర, వీవోఏ రెడ్డెయ్య సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శన

పుల్లంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దళవాయిపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శన ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ మెటీరియల్ ఉపయోగించి పాఠాలు బోధించడానికి అవసరమయ్యే టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ సామగ్రితో విద్యాబోధన సులభతరమే కాకుండా విద్యార్థులు ఇష్టంగా నేర్చుకుని గుర్తు పెట్టుకుంటారన్నారు. ఈ ప్రదర్శనలో టీకప్పులతో చేసిన వర్ణమాల, ఆల్ఫాబెట్ హౌస్, స్థాన విలువల చార్టులు, గణిత మ్యాజిక్ బోర్డు, కలర్‌పేపరుతో చేసిన క్రాఫ్ట్‌వర్కు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

శివపార్వతులకు క్షీరాభిషేకం

లక్కిరెడ్డిపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్రిచెరువు సమీపంలో వెలసిన మాతాంగ పీఠాధిపతి మఠంలో శుక్రవారం శివపార్వతులకు ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. చాతుర్మాస పూజా కార్యక్రమంలో భాగంగా భక్తులు శివపార్వతులకు అభిషేకం, భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ హిందూ ధర్మ ప్రచార ప్రతినిధులు రామచంద్రారెడ్డి, రామకృష్ణ, వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సిద్దవటం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అన్నదాత సుఖీభవ, ఇతర పథకాలు పొందాలంటే ప్రతి రైతు కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసినవి ఎప్పటికప్పుడు లాగిన్‌లో వెరిఫికేషన్ పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ప్రభాకరరెడ్డి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణ

లక్కిరెడ్డిపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే దోమలను నివారించవచ్చునని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలోని 1, 2వ వార్డుల్లోని హనుమాన్ గుండు, పాత మసీదు ప్రాంతాల్లోని మురికికాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణంలో నీరు నిల్వ లేకుండా, తడి చెత్త లేకుండా చూడాలని, వారానికి ఒకరోజు బాత్‌రూమ్‌లోని తొట్టిని శుభ్రం చేయాలన్నారు. దోమతెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివరంజని, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఏఎన్‌యంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాలువల్లో దోమల నివారణ చర్యలు

రాజంపేట టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. శుక్రవారం పట్టణంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువల్లో దోమల లార్వా పెంపొందకుండా అబిట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టామని మున్సిపల్ అధికారులు తెలిపారు.



నీరు నిల్వ ఉన్న డ్రమ్ములను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఎగువగొట్టివీడులో పర్యటిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని ఎగువగొట్టివీడు పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. తల్లికి వందనం, ఫించన్ల పెంపు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల అందజేయడం జరిగిందన్నారు. త్వరలోనే అర్హత కలిగిన రైతులందరికీ అన్నదాత సుఖీభవ అమలు అవుతుందన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

రాయచోటిటౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఆర్డీవో శ్రీనివాస్‌తో పాటు తహీల్దార్లతో సమావేశం నిర్వహించి ప్రజల నుండి వస్తున్న రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

సుపరిపాలనకు కేరాఫ్ చంద్రబాబు

రాయచోటిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు కేరాఫ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అమావాస్య రెడ్డెయ్య, తబ్రేస్, రోఫా, బలరాం తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే పార్టీ బలోపేతం

సుండుపల్లె, జూలై 11(ఆంధ్ర జ్యోతి): కార్యకర్తలు, నాయకుల క్రమశిక్షణతోనే పార్టీ మరింత బలపేతం అవుతుందని ఎన్నికల పరిశీలకుడు త్యాగరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దినేనికాలువ, మాచిరెడ్డిగారిపల్లె, రాయవరం, మడితాడు, చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రా మ కమిటీల ఎంపిక నిర్వహించారు. పోటీ పడినచోట ఆశావహుల పేర్లను అధిష్టానం దృష్టికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో దోమతెరలు తప్పక వాడాలి

ఒంటిమిట్ట, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాత్రివేళల్లో దోమతెరలు తప్పక వాడాలని మండల వైద్యాధికారి వీరేంద్రసింగ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మంటపంపల్లె ప్రాథమిక పాఠశాలలో డెంగ్యూ నివారణ మాసోత్సవాలు సిద్దవటం యూనిట్ అధికారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగ్యూ జ్వరం ప్రాణాంతకమని, ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స చేయించుకుంటే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య, సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ, భాస్కర్‌రెడ్డి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాజంపేట సబ్‌డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో చెట్లు నరికివేత, విద్యుత్ లైన్ల మరమ్మతుల సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట పట్టణం, పుల్లంపేట, నందలూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చిట్వేలిలో..

చిట్వేలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్వేలిలో 33/11కేవీ ఫీడరు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ చలపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిట్వేలి, కస్తూరివారిపల్లె, బాకరాపురం పంచాయతీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

మార్కెట్ కమిటీ సభ్యుడిగా పెంచలయ్య



చిట్వేలి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కోడూరు మార్కెట్ కమిటీ సభ్యుడిగా చిట్వేలి మండలం గట్టుమీదపల్లెకు చెందిన తుపాకుల పెంచలయ్యను నియమించారు. కమిటీ ఛైర్‌పర్సన్‌గా కోడూరు మండలం మైసూరువారిపల్లెకు చెందిన పగడాల వరలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా కోడూరు మార్కెట్‌యార్డు కమిటీని సంపూర్ణంగా ఏర్పాటు చేస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో జనసేన తన ఉనికిని చాటుకోవడంలో పెంచల య్య పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా తుపాకుల పెంచలయ్య మాట్లాడుతూ మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై పోరాడతామన్నారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సహాయం

సిద్దవటం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన కార్యకర్తకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఆ పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అందించారు. మండలంలోని మాధవరం-1 పార్వతీపురంలో ఉండే సురేంద్ర, ఉమాదేవి దంపతుల ద్విచక్ర వాహనాన్ని ఈనెల 6న ఒంటిమిట్ట మసీదు సమీపాన హైవేరోడ్డుపై కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అతికారి కృష్ణ రిమ్స్‌లో వారిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనపార్టీ క్రియాశీలక కార్యకర్త సురేంద్ర కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు చలపాటి చంద్ర, డేరంగుల శ్రీకాంత్, మనవూరి స్వచ్ఛంద సేవాసంస్థ ఛైర్మన్ రవికుమార్ పాల్గొన్నారు.

నేడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాక

వాల్మీకిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఉదయం వాల్మీకిపురం మండలంలోని కంభంవారిపల్లెకు రానున్నారు. కంభం ప్రభాకర్‌రెడ్డి మరణవార్త తెలుసుకున్న తక్షణం ఆయన ఫోన్ ద్వారా ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబీకులకు ఓదార్పు చెప్పారు. కాగా శనివారం ఉదయం జరగనున్న ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియలకు నేరుగా ఆయన హాజరు కానున్నారు.

దాడిపై కేసు నమోదు

సుండుపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిచెరువుకు చెందిన వరుణ్‌పై దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మడితాడు గ్రామంలో కారులో వస్తుండగా కొంత మంది యువకులు కారును అడ్డుకొని కర్రలతో దాడి చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సుండుపల్లె మండలానికి చెందిన సుమారు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అల్లర్లు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెల్నెస్ సెంటర్‌తో వెలుగు

- అంతర్జాతీయ గుర్తింపు పొందనున్న హార్సిలీహిల్స్
- పెరగనున్న పర్యాటకుల సంఖ్య
- మెరుగుపడనున్న మౌలిక సదుపాయాలు


హార్సిలీహిల్స్ ఏరియల్‌వ్యూ

బి.కొత్తకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌కు వెల్నెస్ సెంటర్‌తో వెలుగు రానుంది. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ యోగా గురువు పతంజలి సంస్థ వ్యవస్థాపకుడు రాందేవ్‌బాబాను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి సంస్థ కార్యకలాపాలు సాగించాలని అందుకు తగిన వెసులుబాటు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. అందుకు రాందేవ్‌బాబా కూడా సానుకూలంగా స్పందించి ఇటీవల రాష్ట్రంలో తన బృందంతో పర్యటించి కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబుతోనూ సమావేశమయ్యారు. ఇప్పటికే దేశ విదేశాల్లో నిర్వహిస్తున్న వెల్నెస్ సెంటర్ తరహాలో రాష్ట్రంలోనూ ఏర్పాటుకు ముందుకొచ్చారు. అందులో సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి అందాలు కలిగి వున్న హార్సిలీహిల్స్ ఒకటి.

హిల్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు..

పతంజలి సంస్థకు దేశవ్యాప్తంగా హరిద్వార్ (ఉత్తరాఖండ్), నోయిడా, మోదీనగర్ (ఉత్తరప్రదేశ్), గౌహతి (అస్సాం), పానిపట్ (హర్యానా), పూణే (మహారాష్ట్ర), జబల్‌పూర్ (మధ్యప్రదేశ్), ఆనంద్ (గుజరాత్) తదితర ప్రాంతాల్లో వెల్నెస్ సెంటర్లు ఉన్నాయి. అయితే వాటిలో హిల్‌స్టేషన్ లేదు. హార్సిలీహిల్స్‌లో కనక ఏర్పాటైతే దానికో ప్రత్యేకత ఉండబోతోంది. దేశ విదేశాల నుంచి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలోనే మదనపల్లెకు మినీ ఎయిర్‌పోర్ట్ తీసుకువస్తామని రాకపోకలకు సౌకర్యాలు కల్పిస్తామని స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. హార్సిలీహిల్స్‌లో రూ.200 కోట్లతో ఒబెరాయ్ సంస్థకు ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కేటాయించినా ప్రాజెక్టు స్థాపన ఆలస్యం అవుతోంది. దీంతో వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం దారులు తెరిచినట్లు తెలుస్తోంది.

వెల్నెస్ సెంటర్‌తో సాంత్వన

శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు, సమగ్ర ఏకీకరణ, మానసిక ప్రశాంతత, మనస్సును నిమగ్నం చేసి సాంత్వన పొందటమే వెల్నెస్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యం. బీపీ, థైరాయిడ్, మధుమేహం లాంటి రుగ్మతలకు ప్రకృతి వైద్యం, ఆయుర్వేద మందులు, యోగా ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. పరిస్థితిని బట్టి ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకొని సంస్థ నిబంధనల మేరకు సేవలు పొందవచ్చు. పర్యాటక పరంగా ఆదాయం ఉన్నప్పటికీ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని హార్సిలీహిల్స్‌లో మౌలిక సదుపాయాలు, భద్రత, సుందరీకరణతో మెరుగుపడుతుందని పలువురు భావిస్తున్నారు.

14న మంత్రుల పర్యటన

కురబలకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14న మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డిలు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంగళ్లు, ముదివేడు క్రాస్, దాదాంవారిపల్లె పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాగా కడప క్రాస్ పంచాయతీ ఒంటిల్లు తూర్పు హరిజనవాడ వద్ద ఆర్‌డీ ఎస్ రూ.30 లక్షల నిధులతో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవం, ముదివేడు కేజీబీవీలో రూ.11లక్షల నిధులతో పాఠశాల భవన నిర్మాణం శంకుస్థాపన, దాదంవారిపల్లె పంచాయతీలో రూ.10 లక్షల ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, గొళ్లపల్లెలో రూ.21 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, అంగళ్లు పంచాయతీ టిర్రకోట వద్ద డీఆర్‌డీఏ నిధులతో నిర్మించిన కామన్ ఫెసిలిటి కేంద్రం ప్రారంభం, అంగళ్లు పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్, రూ.80 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సచివాలయం, రైతుసేవా కేంద్రం, ప్రహరీ, అంగళ్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఎన్ఆర్ఈజీఎస్ రూ.10లక్షల నిధులతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష

రామసముద్రం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువడినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. రామసముద్రం-మదనపల్లె రోడ్డులో ఓబినాయనపల్లె బస్ షెల్టర్ వద్ద 6-10-2012న ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వనగానిపల్లెకు చెందిన రామప్ప మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఏటవాకిలి గ్రామానికి చెందిన వైవీ చెంగారెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ నేపథ్యంలో 2018 నవంబరు 22 పుంగనూరు కోర్టు నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. దీన్ని సవాల్ చేస్తూ నిందితుడు మదనపల్లె కోర్టులో అప్పీలు చేసుకున్నాడు. అయితే శుక్రవారం కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మదనపల్లె కోర్టు కూడా అదే శిక్షను అమలు చేయాలని తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యానికి నడక మంచిదే


జెండా ఊపి ప్రారంభిస్తున్న ముంతాజ్‌అలి, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మానవుడి ఆరోగ్యానికి నడక మంచిదే అని పద్మభూషణ్ అవార్డు గ్రహీత ముంతాజ్ అలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సత్సంగ్ ఫౌండేషన్, స్వస్థ ఆస్పత్రి ఆధ్వర్యంలో 3 కి.మీ. వాకతాన్ నిర్వహించారు. ఈ వాకతాన్‌ను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర జెండా ఊపి ప్రారంభించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు 4 కి.మీ. నడిస్తే రోగాల పేరిట ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం వుండదన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వ్యాయామానికి ముందు నడక ఒక ఔషధంలా పనిచేస్తుందన్నారు. అనంతరం సత్సంగ్ ఆశ్రమం నుంచి 3 కి.మీ. పాటు విద్యార్థులు, ప్రజలు వాకతాన్ నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక, ఆరోగ్యమాత, సత్సంగ్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్దేశ్వర, చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం


గజ వాహనంపై ఊరేగుతున్న సిద్దేశ్వరస్వామి

రాజంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ఇలవేల్పు అయిన చెన్నకేశవ, సిద్ధేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గజ వాహనంపై సిద్ధేశ్వరస్వామిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో తాళ్లపాక గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్టీసీతోనే యూనియన్ ఆవిర్భావం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య
- వన్ అండ్ టూ డిపోల గౌరవాధ్యక్షుడిగా నాగూర్‌వలి


యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలిని సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

మదనపల్లెఅర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): 1952లో ఆర్టీసీ సంస్థ ఆవిర్భావంతోనే యూనియన్ ఏర్పాటైందని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడిగా టీడీపీ నేత నాగూర్‌వలిచే ప్రమాణం చేయించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు రాష్ట్ర జిల్లా నేతలు కలిసి సన్మానించారు. అంతకముందే కొమటివాని చెరువు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించి ర్యాలీగా మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ చేరుకున్నారు. సీపీ బాబు సభాధ్యక్షతన నిర్వహిస్తున్న సభలో ఆయన మాట్లాడుతూ కార్మిక నేత సుధాకర్, మలిశెట్టి దామోదర్ జీతాల పెంపుకోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం రాష్ట్ర నేత మలిశెట్టి దామోదర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమార్‌లు మాట్లాడారు. నూతన గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ అందరి సహకారంతో ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణప్ప, మురళి, జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, కల్యాణ్, సురేంద్ర, టీడీపీ నేతలు ఖాదర్‌ఖాన్, సుధాకర్, రామమూర్తి నాయుడు, లక్ష్మన్న, వెంకటరమణారెడ్డి, మధుబాబు, మేస్త్రీ రామకృష్ణ, ఐదు డిపోల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్టీసీ మహిళ ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చౌకదుకాణంపై విజిలెన్స్ దాడులు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సంబేపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరెడ్డి పల్లె గ్రామం షాప్ నెంబర్-1 పేయల వాండ్లపల్లె చౌక దుకాణంపై విజి లెన్స్ అధికారులు గీతావాణి, ఖాజా హుస్సేన్ శుక్రవారం తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డితో కలిసి దాడులు నిర్వహించారు. చౌకదుకాణంలో ఉండాల్సిన స్టాక్ కన్నా తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి షాప్ నెంబర్-1 సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందించాల్సిన నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్ఐ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

చౌకదుకాణంపై విచారణ

సిద్దవటం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె చౌకదుకాణంలో రేషన్‌దారులకు సక్రమంగా నిత్యావసర వస్తువులు అందడం లేదని, మరికొన్ని అక్రమాలు జరుగుతున్నాయని కొందరు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం పి.కొత్తపల్లె రేషన్‌షాపు-4పై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య మాట్లాడుతూ చౌకదుకాణం-4లో రేషన్ లబ్ధిదారునికి 5కిలోలు అందించాల్సి ఉండగా నాలుగు కిలోలు ఇస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్‌బాబు, వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేరళ పోలీసుల అదుపులో మదనపల్లె యువతి

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైనం

మదనపల్లె అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె యువతిని కేరళ పోలీసులు అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణం నక్కలదిన్నెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నక్కలదిన్నె వాసి సాయిబాబా కుమార్తె రోహిణి (27) 2023లో కేరళ రాష్ట్రం ముక్కంలో ఇతరులను మోసం చేయడంతో అక్కడి పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈమె తప్పించుకుని తిరుగుతూ కొద్ది రోజులుగా మదనపల్లెలో ఉంటోంది. సమాచారం తెలుసుకున్న కేరళ పోలీసులు శుక్రవారం నక్కలదిన్నెలో ఇంటి వద్ద అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె విషద్రావణం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అరెస్టు చేసి కేరళకు తరలించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పించాలి

రాజంపేటటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల ఫీజుల్లో రాయితీ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, తాలుకా అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏపీయూడబ్ల్యూజే రాజంపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంఈవో రఘునాథరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట మండల కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల ఫీజుల్లో 50శాతం మేరకు రాయితీ ఇవ్వాలని, కలెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వులను ప్రైవేటు పాఠశాలలు విధిగా అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు మలిశెట్టి సుబ్బరాయుడు, త్రివిక్రమ్, రాజంపేట ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాణ్, శ్రీహరి, వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్ర, ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై రహస్య విచారణ

సిద్దవటం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత పాలన వైసీపీలో ఆర్బీ సంస్థ అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించి గుత్తేదారుని సమయం గడిచినా ఇసుక తవ్వకాలు జరపడంపై పెన్నానదిలో హద్దులు మీరి తవ్వకాలు, మరొకచోట జరిపి కోట్ల రూపాయలు అడ్డగోలుగా సంపాదించిన ఇసుక బకాసురులపై రహస్య విచారణ జరుగుతోంది. ఈ రహస్య విచారణ విజయవాడ ఏసీబీ అధికారులు జ్యోతి, వంతాటిపల్లె, జంగాలపల్లె, మూలపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. సిద్దవటం మండలంలో వైసీపీ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల్లో వైసీపీ ప్రజాప్రతినిధుల ప్రమేయం ఎంతవరకు ఉంది, మరెవరెవరు ఈ ఇసుక కుంభకోణాల్లో ఉన్నారు పూర్తిగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

ఆ మూడు.. సారారహిత గ్రామాలు


సీటీఎం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మదనపల్లెటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని సీటీఎం, పోతబోలు, ములకలదిన్నె గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు ప్రజలతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా నాటుసారా తయారీని వదిలేసిన ప్రజలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందన్నారు. దీని వలన వారి జీవన విధానం మారి సమాజంలో గౌరవంగా బతకవచ్చన్నారు. అందుకే ఈ మూడు గ్రామాల్లో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు, సేవించరాదన్నారు. అలాగే పాత నిందితులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నామన్నారు. ఇక మీదట ఈ మూడు గ్రామాల్లో నాటుసారా విషయమై సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, హెచ్‌సీ వీరనాగయ్య, పీసీలు రేఖ, శివరాణి, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వన్యప్రాణి మృతి


మృతి చెందిన వన్యప్రాణి

రావాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు సమీపంలో శుక్రవారం రోడ్డు దాటుతున్న వన్యప్రాణిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి భరణికుమార్ తెలిపారు. మృతిచెందిన జింకను పోస్టుమార్టం నిమిత్తం రామాపురం పశువైద్యశాలకు తరలించి, అనంతరం అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లి దహనం చేసినట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లెటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఆంధ్రలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ బీఎంపీపీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వేకువజామున బీఎంపీపీ సీఐ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో బెంగళూరు రోడ్డులోని చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కురబలకోట మండలం తుంగావారిపల్లెకు చెందిన ఎం.చంద్ర కుమారుడు ఎం.రమేశ్(27) కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంలో 96 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేశారు. తుంగావారిపల్లెకు చెందిన పి.రామచంద్ర కుమారుడు పి.సోమశేఖర్(20) వద్ద 48 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు నిమిత్తం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.


మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

సాకులు చూపి కోతలు

- గృహనిర్మాణ పథకంలో జిల్లాలో 7652 మంది అనర్హులుగా గుర్తింపు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

పట్టాదారుని పేరు : మద్దిరాల వీరయ్య
తండ్రి/ భర్త పేరు : చిన్న చెంగయ్య
ఖాతా నెంబరు : 903 సర్వే నెం. : 596-3
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 1.63
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ :
1

పట్టాదారుని పేరు : మద్దిరాల వీరయ్య
తండ్రి/ భర్త పేరు : చిన్న చెంగయ్య
ఖాతా నెంబరు : 903 సర్వే నెం. : 607
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 2.05
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ :

వెబ్‌ల్యాండ్‌కు సంబంధించిన వీరయ్య వివరాలు

సంబేపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేదవాడి గృహ నిర్మాణ పథకం (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పక్కా గృహాల నిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 44609 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసే సమయంలో లేని నిబంధనలను చూపుతూ సాకుల పేరుతో కోతలు పెట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 7652 మంది అనర్హుల జాబితాను విడుదల చేశారు. సంబేపల్లె మండలంలో 307 మంది అనర్హులుగా గుర్తించినట్లు తెలియజేశారు. అయితే ఈ జాబితాలో చాలా మంది అర్హులు ఉన్నట్లు చెబుతున్నారు. వారికి 10 ఎకరాల పొలం లేకపోయినా వారి పేరిట ఉందని, గృహ అవసరానికి వాడుతున్న కరెంటు తక్కువ వాడుతున్నా 300 యూనిట్లు వాడుతున్నారని, ఫోర్‌వీలర్ వాహనాలు లేకపోయినా ఉన్నట్లు ఇలా సాకులు చూపి అనర్హులుగా గుర్తించడంతో నిజమైన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

కరెంటు ఎక్కువ వాడినట్లు చూపించారు

- ఎం.ధనలక్ష్మి, పెద్దజంగపల్లి, దుద్యాల గ్రామం



ఈమె పేరు ధనలక్ష్మి. ఊరు దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లి. ఆమె ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో అన్ ఎలిజిబుల్ జాబితాలో ఆమె పేరు ఉంది. కారణం ఆమె 300 యూనిట్లు కరెంటు వాడుతున్నట్లు చూపారు. అయితే ఆమె ఇంటి సర్వీస్ నెంబర్ 2412663 000191కు సంబంధించి ఇప్పటి వరకు ఎప్పుడూ 300 యూనిట్లు దాటిన పరిస్థితి లేదని చెబుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పరిశీలించి అర్హులుగా గుర్తించాలని కోరుతోంది.

అర్హులకు న్యాయం చేస్తాం

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య

ప్రధానమంత్రి ఆవాస యోజన జాబితాలో అన్ ఎలిజిబుల్ అభ్యర్థుల జాబితాను ఇటీవల విడుదల చేశాం. అందులో అనర్హుల పేర్లను ప్రకటించి తెలియజేశాం. అర్హులైన వారు సంబంధిత అధికారుల వద్ద ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే మంజూరు కోసం తిరిగి జాబితాను పంపుతాం. సమస్యపై విచారించి పై అధికారులతో మాట్లాడి అర్హులకు తప్పకుండా న్యాయం చేస్తాం.

పది ఎకరాలు ఉన్నట్లు చూపుతున్నారు

- వీరయ్య, పెద్దజంగంపల్లి, దుద్యాల



ఈయన పేరు మద్దిరాల వీరయ్య. ఖాతా నెంబర్ 903 వెబ్‌ల్యాండ్‌లో 3.68 ఎకరాల పొలం ఉంది. వారి కుటుంబ సభ్యులందరికీ కలిపి ఉన్న పొలం ఇదే. అయితే ఆయనపై 10 ఎకరాలపైన పొలం ఉన్నట్లు చూపిస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 5 ఎకరాల్లోపు పొలం ఉన్నా పది ఎకరాలు ఉన్నట్లు జాబితాలో చూపించడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించినా 3.68 సెంట్లు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా నిజమైన అర్హులను గుర్తించి గృహ నిర్మాణం మంజూరు చేయాలని కోరారు.



జాతీయ రహదారి పనుల్లో భాగంగా విశ్వనాథపురం గ్రామం వద్ద కేసీ ఉపకాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి, సిమెంటు పైపులు వేసి తాత్కాలికంగా వేసిన రోడ్డు

నీళ్లు పారేదెలా...!

కేసీ నీటికి అడ్డంకిగా... జాతీయ రహదారి నిర్మాణ పనులు

చాపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ సాగునీటికి జాతీయ రహదారి నిర్మాణ పనులు అడ్డంకిగా మారాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా బెంగుళూరు-అమరావతి జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా మండలంలోని విశ్వనాథపురం గ్రామం వద్ద కేసీ కెనాల్‌కు ఉపకాలువ అయిన ఏటూరు కాలువపై బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. కాలువలో పెద్ద సిమెంటు పైపులు వేసి పైన తాత్కాలికంగా రోడ్డు వేశారు. ఈరోడ్డుపై ప్రతిరోజు కొన్ని వేల వాహనాలు తిరుగుతుంటాయి. ఈ పైపుల్లో ఒకవైపు పగిలిపోయింది. దీంతో కేసీ కాలువకు సాగునీరు వదిలితే కింద భూములకు పోయేందుకు అవకాశం లేదు. నీటి ప్రవాహానికి రోడ్డు కోసుకుపోయే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ కాలువ పరిధిలో సుమారు 8 వేల ఎకరాల భూములు ఉన్నాయి. విశ్వనాథపురం, అల్లాడుపల్లె, రాజకొట్టాలు, సన్నపల్లె, గాంధీనగర్ తదితర గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం జూలై నెల పంటలు సాగు చేసేందుకు మంచి అదును. అదే సమయంలో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ప్రతి ఏడాది అధికారులు సాగునీటిని కేసీ కెనాల్‌కు వదులుతారు. ఈ కెనాల్ ద్వారా వచ్చే సాగు నీరు తమ పొలాలకు అందాలంటే నేషనల్ హైవే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

'జనాభా పెంచాలని సీఎం చెప్పడం విడ్డూరం'

వేంపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ మంది పిల్లల్ని కనండి, జనాభా పెరగాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పడం విడ్డూరమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. 1990 జూలై 11న ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా దినంగా ప్రకటించిందన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినం లక్ష్యమన్నారు. ప్రపంచ జనాభా 809 కోట్లు అయితే భారత్ జనాభా 144 కోట్లతో మొదటి స్థానంలో ఉందన్నారు. అటు జనాభా, ఇటు జన సాంద్రత విషయంలో భారత్ ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికే కనీస అవసరాలు, ఉపాధి, ఉద్యోగాలు లభించక మద్యం, గంజాయి, డ్రగ్స్‌లకు బానిసలై అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారన్నారు. కావున జనాభా విషయంలో ముఖ్యమంత్రి తన అభి ప్రాయం మార్చుకోవాలని సూచించారు.

రేపు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమీక్ష సమావేశం

కడప క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కడప సీఎస్ఐ చర్చి వద్ద ఈ నెల 13న ఆదివారం ఉదయం 9.30 గంటలకు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దాసరి రమణయ్య, కెప్టెన్ రాముడు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో ఇళ్ల స్థలాలు, రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది సమస్యలు, సంక్షేమంపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి హాజరు కావాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. జీఓ 77ను రద్దు చేయాలని కోరారు. శుక్రవారం మహవీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

లింగాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరోపణలు రావడంతో పులివెందుల డీఎల్డీఓ విజయలక్ష్మి విచారణ చేపట్టారు. శుక్రవారం లింగాల మండల పరిషత్ కార్యాలయంలో ఆమె రికార్డులను పరిశీలించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.40లక్షలు ఏమయ్యాయో.. వాటిని ఏ అభివృద్ధి పనులకు ఉపయోగించారో అర్థం కావడం లేదు. కాగా గత నెలలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో మండలాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై జడ్పీ సీఈఓ ఓబులమ్మ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల మండలానికి సంబంధించి నిధులను ఎందుకు ఖర్చు చేయలేదని అడగడంతో అధికారులు తమ ఖాతాలలో ఉన్న నిదులను ఖర్చు చేశామని చెప్పారు. అయితే జడ్పీ రికార్డులలో నిధులు ఖర్చు కాకుండా అలాగే ఉన్నట్లు చూపడంతో, రికార్డులకు అధికారులు చెప్పేలెక్కలకు పొంతన లేకపోవడంతో జడ్పీ సీఈఓ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు పులివెందుల డీఎల్‌డీఓ నిధుల వినియోగంపై విచారణ చేపట్టారు. అప్పటి ఎంపీడీఓలు సురేంద్రనాథ్, తేజోష్ణ, ఏఓ లోకేష్ విచారణకు హాజరయ్యారు. ఆ మేరకు డీఎల్డీఓ అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి కేసులో హైకోర్టు ఉత్తర్వులు

- 41 నోటీసు ఇచ్చి విచారణ చేయాలని సూచన
- 11 మందిని కోర్టుకు పంపగా వెనక్కి పంపిన జడ్జి

వేంపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో బాలిక అదృశ్యంపై జరిగిన నాటకీయ పరిణామాలలో బాలిక తరపు బంధువులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన వారు హైకోర్టును ఆశ్రయించారు. బాలిక అదృశ్యం కావడంతో పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లామని అక్కడ తోపులాటలో పోలీస్‌స్టేషన్ అద్దాలు పగిలిపోతే హత్యాయత్నం కేసు నమోదు చేశారని హైకోర్టులో పిటీషన్ వేయగా.. 41 నోటీసు ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవాలని శుక్రవారం హైకోర్టు జడ్జి ఆదేశించారు. కాగా, వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన కేసుకు సంబంధించి 12 మందితో పాటు మరో 150 మందిపై కేసు నమోదైంది. ఇందులో నిందితులుగా ఉన్న హుస్సేన్ మరో 12 మందిని అరెస్టు చేసి శుక్రవారం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరిచారు. ఈలోగా హైకోర్టు 41 నోటీసుతో విచారించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో నిందితులను విచారించి తదుపరి చర్యలు తీసుకోవాలంటూ జమ్మలమడుగు జడ్జి ఆదేశించినట్లు సీఐ నరసింహులు తెలిపారు. దీంతో జమ్మలమడుగు కోర్టులో హాజరుపరిచిన 11 మందిని వెనక్కి పిలిపించి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విచారణలో వారు చెప్పిన వివరాలను కోర్టుకు సమర్పించిన తర్వాత కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. కాగా ఈ కేసులో ఇప్పటికే చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. హైకోర్టు ఉత్తర్వులతో వారందరికి ఊరట లభించింది. నోటీసు ఇచ్చి విచారించిన తర్వాతే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

పులివెందుల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో గాయపడిన శివశంకర్‌రెడ్డి (58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని బాకరాపురానికి చెందిన శివశంకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిల మధ్య ఇంటి వద్ద ప్రహరీగోడ విషయమై వివాదం ఉండేది. ఈ నేపథ్యం లో జూన్ 30వ తేదీన ఘర్షణకు పాల్పడ్డారు. శివశంకర్‌రెడ్డిపై పవన్ కుమార్‌రెడ్డి అతని కుమారుడు సందీప్ రెడ్డిలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అతన్ని కుటుంబ సభ్యులు కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున శివశంకర్‌రెడ్డి మృతి చెందారు. ఈ మేరకు పవన్‌కుమార్‌రెడ్డి, సందీప్‌రెడ్డిలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, విచా రణ సాగిస్తున్నామని ఏఎస్ఐ సిద్దార్థ తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

మైదుకూరురూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామ సమీపంలో గురువారం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరికి శుక్రవారం మైదుకూరులో అంత్యక్రియలు నిర్వహించారు. మృతులు మైదుకూరు పట్టణం మహబూబ్‌నగర్‌కు చెందిన షేక్ కమాల్‌బాషా(50) పటాన్ మున్ని(40), మాబుచాన్, నాసియా (3 నెలలు)కు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం మృతదేహా లను మైదుకూరుకు తీసుకువచ్చి బంధువులు, స్థానికులు కలిసి అశ్రునయనాల మధ్య అంత్రక్రియలు నిర్వహించారు. కాగా హైదరాబాద్‌కు విహారయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వీరు మృతి చెందిన విషయం తెలిసిందే.

ఆటో తగిలి చిన్నారి మృతి

ఖాజీపట జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూలవారిపల్లెలో పాల ఆటో తగిలి అంజలి (3) అనే చిన్నారి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. మూలవారిపల్లెకు చెందిన రామ్మోహన్ కుమార్తె అంజలి రోడ్డుపై ఉండగా పాల ఆటో తగలడంతో టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాటర్ ట్యాంక్‌పడి దెబ్బతిన్న నివాస గృహం





కూలగొట్టే క్రమంలో.. ఇంటిపై పడిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కాశినాయన, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావిశెట్టిపల్లెలో శుక్రవారం శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను కూలదోస్తుండగా సమీపంలోని నివాస గృహంపై పడింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామం నడిబొడ్డున ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామస్థులు ట్యాంక్‌ను వినియోగించక ఇది శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం దీనిని కాంట్రాక్టర్ కూలగొట్టే క్రమంలో వెంకటసుబ్బయ్య ఇంటిపై పడింది. దీంతో ఆ ఇల్లు కొంత భాగం దెబ్బతింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబయ్యను వివరణ కోరగా కూలగొట్టమని తాము ఎవరికీ చెప్పలేదన్నారు. దీనిపై విచారించి పైఅధికారుల దృష్టికి తీసుకపోయి చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసుల విచారణకు వచ్చి...

బద్వేలుటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాల కేసులో విచారణకు హాజరయ్యేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన నకిలీ ఇంటిపట్టాల కేసులో పలువురిని పోలీసులు విచారిస్తున్నారు. ఈక్రమంలో బయనపల్లెకు చెందిన పిల్లి భాస్కర్‌ను విచారణ నిమిత్తం గత వారం రోజులుగా ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాత్రి ఇంటికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం విచారణ నిమిత్తం స్టేషన్‌వద్దకు వచ్చిన పిల్లి భాస్కర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించి.. మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను

సోషల్ ఆడిట్ కోసం ఉంచాలి

- జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్

కమలాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను తప్పనిసరిగా సోషల్ ఆడిట్ కోసం ఉంచాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం కమలాపురం డివిజన్ పరిధిలో రైతు సేవ కేంద్రా సిబ్బందికి ఏడీఏ నరసింహారెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రైతుసేవ కేంద్ర సిబ్బంది వ్యవసాయశాఖలోని పథకాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా తప్పనిసరిగా సోషల్ ఆడిట్ కోసం ఉంచాలని, జాబితాలో పేరు లేని రైతులు రైతుసేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి గ్రీవెన్స్ ఇవ్వాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాలలో నిర్వహించాలని, ఆయా గ్రామ రైతులందరికీ ఆర్ఎస్‌కే సిబ్బంది తెలపాలన్నారు. పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు, రైతుసేవ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ సెమిస్టర్ పరీక్షలు

తొలి రోజు 96శాతం మంది హాజరు



పీజీ పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, సీఈ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాల, అనుబంధ పీజీ కలాశాలల రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 96శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 674 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6503 మంది (96శాతం) హాజరయ్యారు. 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈపరీక్షలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప ఎస్వీ పీజీ కళాశాల, ప్రొద్దుటూరు ఎస్వీఎస్ఆర్ పీజీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను పంపామని, ప్రత్యేకంగా హైపవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

భూకబ్జాల విషయంలో ఎవరినీ ఉపేక్షించవద్దు

- బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి



బద్వేలుటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భూకబ్జాలు, నకిలీ పట్టాల విషయంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్న నేపథ్యంలో కొన్ని ప్రచార మాధ్యమాల్లో టీడీపీ వ్యక్తుల ప్రమేయం ఉందని వస్తున్న ఆరోపణలపై నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి స్పందించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూకబ్జాలు, నకిలీ పట్టాల విషయంలో ఎంతటి వారినైనా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీ సుశాఖ అధికారులను కోరారు. బద్వేలులో గత వైసీపీ ప్రభుత్వంలోనే అనేక మంది భూకబ్జాలకు పాల్పడ్డారని స్వయంగా తానే ప్రజలకు తెలియజేశానన్నారు. అలాంటి వారిని ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కబ్జాదారులను విచారిస్తూ చర్యలను తీసుకుంటున్నారన్నారు. చట్టానికి అందరూ సమానమేనని, పార్టీలకు అతీతంగా ఏ పార్టీకి చెందిన వారినైనా కఠిన చర్యలు తీసు కోవాల్సిందిగా ఆయన కోరారు.

ఆడిట్ బృందం తనిఖీలో లోపాలు

- ప్రతి పనిలో వేలెత్తి చూపడమే..
- బతికి ఉన్నమొక్కలను చచ్చిపోయినట్లుగా చూపిన వైనం

పులివెందుల రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిన ఆడిట్ బృందం తనీఖీల్లో లోపాలు ఉన్నట్లు బట్టబయలైంది. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆడిట్ బృందం 2024-25 సంవత్సరంలో జరిగిన పనులు, ఖర్చుచేసిన వివరాలు తనిఖీ చేసి నివేదికలు తయారు చేసింది. ఎస్టిమేషన్ ప్రకారం పనులు జరిగాయా, ఉపాధి ద్వారా ఎక్కడెక్కడ ఏఏ పనులు చేశారు, ప్రజలకు ఉపయోగపడుతున్నాయా, నిధులు ఎంత వెచ్చించారు, ఖర్చు చేసినంత మేర పనులు జరిగాయా అనే తదితర వివరాలు నివేదికలు తయారు చేశారు. అయితే కొన్ని చోట్ల డకౌట్ పాండ్ జరిగిన పనుల్లో లోతు, పొడవు, వెడల్పు నిబంధనల ప్రకారం కాకుండా తక్కువగా జరిగాయని తాము పరిశీలించామని తనిఖీ బృందం వివరించింది. దీంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు సమాధానమిస్తూ ప్రతి పని పక్కాగా చేశామని, ఫొటోలు చూపించారు. మరికొన్ని చోట్ల డకౌట్ పాండ్స్ లోతు తక్కువగా తీశారని తనిఖీ బృందం తెలియజేయగా అక్కడ పెద్దరాయి ఉందని అందుకే అలా తక్కువగా తీయించామని, దీన్ని అంతా ఎంబుక్‌లో నమోదు చేశామని పీడీకి వివరించారు. అలాగే కనంపల్లెలో ఉపాధి కింద చీనీ మొక్కలు నాటుకున్నామని, అయితే తనిఖీ బృందం వారు 9 మొక్కలు చనిపోయినట్లు నివేదిక ఇచ్చారని ఓ రైతు తెలిపారు. ప్రతి పనిలోను ఏదొక వంకలు పెడుతున్నారని పలువురు చర్చించుకున్నారు. కాగా సామాజిక తనిఖీలో ఉపాధి సిబ్బంది లోపాలు బయటపడేవని, అయితే ఈసారి సామాజిక తనిఖీ బృందం తనిఖీల్లో లోపాలు బయటపడ్డాయని పలువురు అధికారులు, రైతులు చర్చించుకోవడం గమనార్హం.



డ్వామా పీడీ ఆదిశేషారెడ్డిని చుట్టుముట్టిన ఆడిట్ బృందం, ఉపాధి సిబ్బంది

ఘనంగా శాకంబరి ఉత్సవం


శాకంబరి అలంకరణలో దర్శనం ఇస్తున్న పార్వతీ, లక్ష్మీ, అన్నపూర్ణేశ్వరి అమ్మవార్లు

పెద్దతిప్పసముద్రం జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శాకంబరి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవార్ల ప్రతిమలకు ప్రత్యేకంగా వివిధ రకాల కూరగాయాలు, ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ విశేష అభిషేకాలను నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పాలను సమర్పించారు. శాకంబరి అలంకరణలో ఉన్న పార్వతీ, లక్ష్మీ, అన్నపూర్ణేశ్వరి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాకంబరీ దేవిగా వాసవీ అమ్మవారు



పీలేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం మూడో శుక్రవారం సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు నాగేశ్వర స్వామి, మంజునాథ స్వామి శుక్రవారం ఉదయం అమ్మవారిని వివిధ కూరగాయలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. శాకాంబరీ అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆర్యవైశ్య సంఘ సభ్యులు, సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. విశేషాలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం మహిళలు రాహుకాలంలో ఆలయం చేరు కుని చీర, జాకెట్లు, పుసుపు, కుంకుమ, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. నిమ్మకాయలపై నెయ్యి ఒత్తులతో దీపారాధన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలెపాళెం కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, పర్యవేక్షించారు.

సాంకేతిక సాయంతో ఖర్చులు తగ్గింపు


మల్లారపువారండ్లపల్లెలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులను గణ నీయంగా తగ్గించవచ్చని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా శుక్రవారం ఆయన కేవీ పల్లె, పీలేరు మండలాల్లో విస్తృతంగా పర్యటించి కూటమి ప్రభుత్వం ఏడాది విజయాలపై ప్రచారం చేశారు. కేవీపల్లె మండలానికి రూ.10 లక్షలతో మంజూరైన కిసాన్ డ్రోన్‌ను మల్లారపువారండ్లపల్లెలో ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు వ్యవసాయంలో సాంకేతికతను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి కిసాన్ డ్రోన్‌లను మంజూరు చేస్తున్నారన్నారు. డ్రోన్‌ల ద్వారా పంటలకు ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేసుకోవడం సులభతరమవుతుం దని, తద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు.

ఆసక్తి గల నిరుద్యోగులు, ఔత్సాహిక రైతులు సంఘంగా ఏర్పడి కిసాన్ డ్రోన్ పథకాన్ని పొందవచ్చన్నారు. అనంతరం మల్లారపువాండ్లపల్లె, లక్ష్మిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో డీఏఓ శివనారాయణ, కేవీపల్లె, పీలేరు మండలాల అధికారులు, టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కలికిరిలో....

కలికిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన- తొలి అడుగు ఇంటింటి కార్యక్రమంలో మండలంలో కొనసాగుతోంది. గ్రామాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. ఎమ్మెల్యే సొంత పంచాయతీ కొటాల గ్రామంలో శుక్రవారం రాత్రి వరకూ కొనసాగింది. రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వానునూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నల్లయ్య, నాగరాజ, మల్లయ్య, సుశీల్‌కుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

కలకడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని టీడీపీ నేతలు అన్నారు. కోన, బంగారువాండ్లపల్లి, గంగిరెడ్డిగారిపల్లి ప్రాథమికపాఠశాలలు, అంగన్వాడీల్లో చదివే 250మంది పిల్లలకు దాత చెంగళ శివశంకర్ అందజేసిన బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. నేతలు బరకం శ్రీనివాసులురెడ్డి, చంద్ర మోహన్, త్యాగరాజు, శ్రీనివాసులు, గురుస్వామి, బాలయ్య పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

పీలేరు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దేవులవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పులిచెర్ల మండలం ఆరవవాండ్లపల్లె దాతలు విద్యాసామగ్రి అందచేశారు. పద్మావతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు సాంబశివనాయుడు, సుధాకర్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు ఇతర సామగ్రి అందజేశారు. పరంధామనాయుడు, భానుప్రకాష్ నాయుడు, మహేష్ నాయుడు విద్యార్థులు పాల్గొన్నారు.

అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

నిమ్మనపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో కార్యదర్శులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తవళం, నిమ్మనపల్లి, అగ్రహారం పంచాయతీల సిబ్బంది చేపడుతున్న చెత్త సేకరణను తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతాహి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. కార్యదర్శులు రోజూ ఉదయం 7గంటలకే గ్రామాల్లో పర్యటించి అంబుడ్స్‌మెన్‌ల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించి ఖచ్చితంగా చెత్త ద్వారా ఎరువు తయారీకి దోహదపడాలన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

పీలేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని రేగళ్లు, తలపుల పీహెచ్‌సీల వైద్య సిబ్బంది నిర్వహించారు. అధిక జనాభాతో కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జనాభా నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలిపి వారిని చైతన్యవంతుల్ని చేయాలని సిబ్బందికి సూచించారు. శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించి ఆచరించాల్సిన ఆవశ్యకతను తెలియజేయాలన్నారు.

కంభం నిరంజన్‌రెడ్డికి పితృవియోగం

● నివాళులర్పించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



వాల్మీకిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, పీలేరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత కంభం నిరంజన్‌రెడ్డి తండ్రి కంభం ప్రభాకర్‌రెడ్డి(82) శుక్రవారం ఉదయం మృతి చెందారు. సుదీర్ఘ కాలంగా నల్లారి కుటుంబంతో అత్యంత సన్నిహితంగా మెలిగిన కంభం ప్రభాకర్‌రెడ్డి మృతి చెందడంతో మండలంలోని గండబోయనపల్లె పంచాయతీలో పలువురు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కంభంవారిపల్లెకు చేరుకుని ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. నిరంజన్‌రెడ్డి కుటుంబీకులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మండల లోని వివిధ పార్టీల నేతలు, ప్రజలు సంతాపం తెలియజేశారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా విడుదల

పెద్దతిప్పసముద్రం జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకం కింద 2025 అర్హుల జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాల నోటీస్ బోర్డుల్లో పొందుపరిచినట్లు ఏఓ ప్రేమలత వెల్లడించారు. రైతుసేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ రైతుల అర్హుల జాబితాను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని వారు సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, భూమి పత్రాలు, భూమికి సంబంధిత రైతు, ఆధార్‌తో లింక్ కాబడిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలన్నారు. అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో గానీ లేదా మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పంచాయతీ సెక్రటరీల అధ్యక్షుడిగా మునిస్వామి

రామసముద్రం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల యూనియన్ అధ్యక్షుడిగా రామసముద్రం కార్యదర్శి మునిస్వామినాయక్, ఉపాధ్యక్షుడిగా చెంబకూరు కార్యదర్శి రెడ్డిశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కేసీపల్లి కార్యదర్శి మారప్ప, కోశాధికారిగా లతాప్రసన్న, మీడియా ప్రతినిధిగా టి.రెడ్డిశేఖర్‌ను ఎన్నుకున్నట్లు మునిస్వామినాయక్ తెలిపారు.

తాగునీరు, పారిశుధ్యం పట్ల దృష్టి సారించాలి

వాల్మీకిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యల పట్ల ఎప్పటికప్పుడు అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ మనోహర్‌రాజు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతీయులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ నిర్మల, వెటర్నరి ఏడీ విశ్వేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిగడ్డి మేతతో అధిక పాల ఉత్పత్తులు

పెద్దమండ్యం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పచ్చిగడ్డి మేతతో పాడిఆవుల్లో అధిక పాల ఉత్పత్తులు సాధించవచ్చని మదనపల్లి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. నీరజ పేర్కొన్నారు. వెలిగల్లు, బండమీదపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. వెలిగల్లు పాడిఆవు రైతులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ మంచి పోషక విలువలున్న ధాన్యపుజాతి, పప్పుజాతి పశుగ్రాస రకాల విత్తనాలు, మొలకలు ఎంపిక చేసి నాటుకోవాలన్నారు. పశుగ్రాస చెట్లు అవిశ, సుబాబుల్ గురించి తెలిపారు. కత్తిరించిన గడ్డి వల్ల మేత వృథా కాదన్నారు. పాడి ఆవు రైతులకు పశుగ్రాసం గురించి పలు అంశాలను తెలియజేశారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా కేవలం రూ. 150కే ఇంజక్షన్ అందుబాటులో వుందన్నారు. అనంతరం బండమీదపల్లి రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. వెలిగల్లు పశువైద్యాధికారి చరిత, సర్పంచులు బయ్యారెడ్డి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పక వేయించాలి

తంబళ్లపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): లంపిస్కిన్ (బొబ్బల వ్యాధి) సోకకుండా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలని ఏడీ సుమిత్ర పాడి రైతులకు సూచించారు. శుక్రవారం కన్నెమడుగు పంచాయతీ రెడ్డివారిపల్లెలో నిర్వహించిన లంపిస్కిన్ నివారణ టీకాల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రక్తం పీల్చే దోమలు కుట్టడంతో ఒక పశువు నుంచి మరో పశువుకు ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి సోకితే పశువులు నీరసించి మేత, నీరు తీసుకోవని, దీని ద్వారా పాల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతారన్నారు. పశువుల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో 31 వరకు చేపడతామని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

నిందితులను అరెస్టు చేయాలి


తహసీల్దారు కార్యాలయం వద్ద పాత్రికేయుల నిరసన

పీలేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేత జగన్ బంగారుపాళెం పర్యటనలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివశంకర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పీలేరు పాత్రికేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శివశంకర్‌పై దాడిని ఖండిస్తూ శుక్రవారం పీలేరులోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయులు పఠాన్ జాకీర్, నాగరాజ, మల్లెల జాకీర్, జలకనూరి చంద్రశేఖర రాజు, అల్తాఫ్, సురేంద్ర, మస్తాన్, మయూర్‌నాథశర్మ, గండికోట వెంకటేశ్, తులసి, రవి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మదనపల్లె టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసిన వైసీపీ గుండాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పూరి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మామిడి రైతుల పరామర్శ పేరుతో వచ్చిన జగన్ చిత్రాలను ఫొటోలు తీస్తుంటే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయడంతోనే వైసీపీ గుండాలు శివకుమార్‌ను విచక్షణ రహితంగా దాడి చేశారన్నారు. ఈ ఘటనలో నారాయణ స్వామిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, టీఎన్ఎస్ఎఫ్ నేతలు శశికుమార్, రాజేంద్రప్రసాద్, కల్యాణ్ గౌతమ్, కుమార్ రెడ్డి, హరి, దామోదర్ పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి నేడు మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో శనివారం ఉదయం శనీశ్వరస్వామికి షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మహాతైలాభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. అర్ధాష్టమ శని దోషాలున్న వారు ఈ పూజల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

యల్లమ్మ జాతరకు 25 ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): కలికిరి యల్లమ్మ జాతర పురస్కరించుకుని పీలేరు డిపో నుంచి 25 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం నిర్మల తెలిపారు. శుక్రవారం ఆమె పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ 12వ తేదీ నుంచి 14 వరకూ జాతర జరుగుతుందన్నారు. భక్తులకు మెరుగైన రవాణ వసతి కల్పించడం కోసం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. జాతర సందర్భంగా కలికిరి-పీలేరు, కలికిరి-మదనపల్లె, కలికిరి-తిరుపతి, కలికిరి-సదుం, కలికిరి- సోమల, కలికిరి-కలకడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మదనపల్లె టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణం సహా సీటీఎం, నిమ్మనపల్లె, కురబలకోట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం పేర్కొన్నారు. మదనపల్లెలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ వుండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ ఒక ప్రకటనలో కోరారు.

వాల్మీకిపురం మండలంలో...

వాల్మీకిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ అన్నారు. మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ తదితర సమస్యల పరిష్కారం నిమిత్తం శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులున్నా ఆదుకుంటున్న ప్రభుత్వం

కలికిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులున్నా బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం వెనుకాడడం లేదని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతినెలా కనీసం రూ.40 లక్షల సీఎం సహాయ నిధులు విడుదలవున్నట్లు చెప్పారు. శుక్రవారం నియోజకవర్గంలోని 32 మందికి మంజూరైన రూ.30.13 లక్షలు విలువైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఆయా మండలాల టీడీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ


సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కలకడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లి బీసీ హాస్టల్‌ను ఎంపీడీఓ భానుప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల వసతి సౌకర్యం, స్నానపు గదులు, మరుగుదొడ్ల కొరతను గుర్తించి పనుల పూర్తికి అక్కడి నుంచే ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్టోర్ రూం, వంటగదికి వెళ్లి సరుకుల నాణ్యతను పరిశీలించారు. క్రమం తప్పకుండా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని వార్డెన్‌కు సూచించారు. ప్రాంగణలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ మునీంద్రనాయక్, వార్డెన్ సుబ్బరామయ్య, కార్యదర్శి నందిని పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కురబలకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా కె.శేషగిరికుమార్, గౌరవాధ్యక్షుడిగా టి.ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, ప్రధాన కార్యదర్శిగా రామప్ప నాయుడు, కోశాధికారిగా ఫిరోజ్, మిడియా ప్రతినిధిగా నరేంద్ర, కార్యవర్గ సభ్యులుగా రమణ, షబీనా, నరసింహులు, ప్రశాంతి, శివకుమార్, పురుషోత్తం, గురుమోహన్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ గంగయ్య అభినందించారు.

సమస్యలను ధైర్యంగా చెప్పాలి

గుర్రంకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల్లో విద్యార్థులు సమస్యలుంటే ధైర్యంగా తెలియజేయాలని ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి అన్నారు. గుర్రంకొండ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం తనిఖీ చేసిన ఆయన భోజనానికి వినియోగిస్తున్న బియ్యం, కూరగాయలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం, తాగునీరు, రాత్రిపూట ఉపాధ్యాయురాలు అందుబాటులో ఉన్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శిరీషను ఆదేశించారు.